


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




వైఎస్సార్ శవం సాక్షిగా పుట్టిన పార్టీ వైసీపీ

- ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

10



# గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి వెలుగులు

- పంచాయతీరాజ్ శాఖ బలోపేతం
- ప్రతి ఇంటి, గ్రామ, ప్రాంత అవసరాలు గుర్తించి, సదుపాయాల కల్పన
- వచ్చే జనవరి నుండి జన్మభూమి 2.0 కార్యక్రమం
- గ్రామాభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాములను చేస్తాం
- పంచాయతీ రాజ్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సమీక్షకు హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, అధికారులు

2 లో

## అమరావతి నిర్మాణంలో భాగం పంచుకోండి

- ప్రపంచబ్యాంకు, ఏడీబీని కోరిన సీఎం చంద్రబాబు



- వివరాలు 3 లో..

## వెలిగొండ పాపం వైసీపీదే!



- గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టు పనులు ఆలస్యం
- 50 రోజుల్లోనే పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాం
- ఏడాదిలోనే ప్రాజెక్టు పనుల పూర్తికి చర్యలు
- రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల

- వివరాలు 6 లో..

## వెలిగొండపై ఎందుకన్ని అబద్ధాలు!

- నిలువెత్తు నిర్లక్ష్యం వైసీపీదే కదా జగన్?
- నీ వైఫల్యాలను ఎన్నాళ్లని దాచగలవు?
- ప్రాజెక్టుపై రాజకీయం చేసింది నువ్వుకాదా?
- 11 ముంపు గ్రామాలతో ఆటాడుకున్నదెవరు?
- నీ నిర్లక్ష్యంవల్లే ప్రాజెక్టుపై అదనపు భారం
- నిర్వాసితులను నట్టేట ముంచిన పాపం పోతుందా?
- పెండింగ్ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవాలు..

7 లో

## పొలిటికల్ పెన్‌కౌంటర్



తిరుపతి జిల్లా శ్రీసిటీలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు దొరికిన గౌరవంపై అప్పుడే బురదజల్లుడుకు సిద్ధమైంది వైసీపీ. శ్రీసిటీకి వచ్చిన కంపెనీల క్రెడిట్ మొత్తం జగన్‌దేనని, ఆయన కుదుర్చుకున్న ఒప్పందాలే ఇప్పుడు అమల్లోకి వస్తున్నాయంటూ విషపత్రికలో కట్టుకథలను ప్రచారం చేస్తోంది.

*కిందపడిన మీదమాట*
*మానదుగా.. వైసీపీ!*
*జాకీలతా లేపుతోంది*
*జగను కీర్తి ఖండాంతి!?*

*బాబుపైన బురదజల్లు*
*పైశాచిక ఆనందం..!*
*అడుసుతొక్కి కాళ్లుకడగ....*
*అదివాళ్లకు నిత్యకృత్యం!!*

*శ్రీసిటీలో కంపెనీలు*
*జలగగారి చలవేనట!?*
*అబద్ధాలు చెబుతున్నది*
*అతనికంటె చవటేనట!!*

*ఒట్టుపెట్టి వరుసపెట్టి*
*చెప్పగలరు అబద్ధాలు!*
*కిందనుంచి పైదాకా...*
*ఆచరించు అధర్మాలు!?*

-మహాదేవ

## ఏపీలో భారీవిస్తరణకు హెచ్‌సీఎల్ సన్నాహాలు!

- మరో 15 వేల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు
- మంత్రి లోకేష్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

- వివరాలు 5 లో..

## ఆధునిక సాంకేతికతతో ఇళ్ల నిర్మాణాల నాణ్యతా ప్రమాణాల తనిఖీ

- ముఖ్యమంత్రి ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వ సంస్థతో థర్డ్ పార్టీ విచారణ
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపర చర్యలు
- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టీకరణ

- వివరాలు 9 లో..



## భూవివాదాలపైనే ఎక్కువ ఫిర్యాదులు

- సంబంధిత శాఖ సమన్వయంతో సత్వర పరిష్కారం
- సిబ్బందికి మంత్రి నారా లోకేష్ ఆదేశం
- 28వ రోజు లోకేష్ 'ప్రజాదర్బార్'కు బారులు తీరిన ప్రజలు
- బాధితుల నుంచి వినతులు స్వీకరించిన లోకేష్

4 లో

## పర్మినెంట్ చేయకుండా వైసీపీ మోసగించింది



- విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన
- పక్క జిల్లాల్లో డ్యూటీలపై హోంగార్డుల వినతి
- జీతాలు రాలేదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గోడు
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి వినతిపత్రాలు
- అర్జీలు స్వీకరించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి

8 లో



## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి


- ఏ ఒక్క రైతుకూ ఆదాయం తగ్గకూడదు
- అవసరమైన విత్తనాలపై 80శాతం రాయితీ
- పంటల సాగుపై రైతుకు సూచనలివ్వండి
- వాస్తవ అంచనాలను రూపొందించండి
- సేద్యం మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు
- సీమ జిల్లాల్లోని ఖాళీ భూములపై సమీక్ష

3 లో



# గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి వెలుగులు

- పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేస్తాం
- ప్రతి ఇంటి, గ్రామ, ప్రాంత అవసరాలు గుర్తించి, సదుపాయాలు కల్పిస్తాం
- వచ్చే జనవరి నుండి జన్మభూమి 2.0 కార్యక్రమం
- గ్రామాభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాములను చేస్తాం
- పంచాయతీ రాజ్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.990 కోట్లు, జల్‌జీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర వాటా రూ.500 కోట్లు విడుదల చేస్తున్నామన్న సీఎం
- సమీక్షకు హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, అధికారులు
- పంచాయతీరాజ్ శాఖలో తీసుకుంటున్న నిర్ణయాలు, సంస్కరణలను సీఎంకు వివరించిన డిప్యూటీ సీఎం



అమరావతి(చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకమైన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. 2014-19 మధ్య చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా నాడు గ్రామాల రూపు రేఖలు మార్చితే... గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసి గ్రామాలను సమస్యలకు కేంద్రాలుగా మార్చిందని సీఎం అన్నారు. మళ్లీ గ్రామాల్లో వెలుగు తెచ్చేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు పంచాయతీ రాజ్ శాఖకు జవసత్వాలు అందిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. ఒక ఇంటికి, ఒక గ్రామానికి, ఒక ప్రాంతానికి ఏమి అవసరమో గుర్తిస్తాం... సదుపాయాలు కల్పిస్తామన్నారు.ఒక ఇంటికి అవసరమైన విద్యుత్, గ్యాస్, టాయిలెట్, నీటి కుళాయి వంటి వాటిని అందిం చేందుకు ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. అలాగే ఒక గ్రామానికి అవసరమైన వీధి లైట్లు, డ్రైనేజీ కాలువలు, సిమెంటు రోడ్లు, తాగునీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాల వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. గ్రామం నుంచి సమీప ప్రాంతాల అనుసంధానం కోసం రోడ్లు, మార్కెట్ ప్లేస్ లు వంటివి ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. వీటిని కూడా కనీస అవసరాలుగా గుర్తించి అందించేం దుకు పంచాయతీ రాజ్ శాఖ సమగ్రమైన ప్రణాళికతో రానున్న రోజుల్లో పనిచేయాలని సూచించారు. వచ్చే జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నామని, గ్రామాల అభివృద్ధికి ముందుకు వచ్చే వారితో కలిసి పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నామని సీఎం తెలిపారు. సచివాలయంలో మంగళవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, అటవీ శాఖలపై సీఎం సమీక్ష చేశారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాబోయే 5 ఏళ్లలో 17,500 కి.మీ సీసీ రోడ్ల నిర్మాణం

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వం తీరుతో గ్రామాల్లో ఖర్చు చేయాల్సిన నిధులు దారి మళ్లాయి. దీని వల్ల కనీస స్థాయిలో కూడా మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. ప్రస్తుతం పంచాయతీ రాజ్ శాఖకు రావాల్సిన రూ.990 కోట్లను ఆర్థిక శాఖనుంచి విడుదల చేస్తున్నాం. ఇంటింటికీ కుళాయి ద్వారా మంచినీళ్లు అందించేందుకు కేంద్రం తీసుకొచ్చిన జల్‌జీవన్ మిషన్ పథకాన్ని గత ప్రభుత్వం ఉపయోగించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. జల్ జీవన్ మిషన్ పనుల్లో రాష్ట్రం 19వ స్థానానికి దిగజారిపోయిందంటే.. అది నాటి ప్రభుత్వ అలసత్వానికి ఉదాహరణ. జల్ జీవన్ మిషన్ కోసం రాష్ట్ర వాటా కింద ఆర్థిక శాఖ నుంచి రూ.500 కోట్లు వెంటనే విడుదల చేస్తాం. కేంద్రం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని ఇంటింటికీ తాగునీరు అందిస్తాం. అలాగే రాబోయే ఐదు సంవత్సరాల్లో 17,500 కిలో మీటర్ల మేర సిమెంట్ రోడ్ల నిర్మాణం, 10 వేల కి.మీ సీసీ డ్రైనేజీ కాలవల నిర్మాణం జరపాలి. ఈ పనుల పూర్తికి ఎంత సమయం పడుతుంది...ఏడాదికి ఎంతమేర పనులు చేయగలరు అనేది లక్ష్యంగా నిర్దేశించుకుని వెళ్లాలని సీఎం చంద్రబాబు సూచించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల ఎల్ఈడి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తే తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణ కూడా చేపట్టకుండా వదిలేసిన వైనాన్ని అధికారులు వివరించారు. ఇప్పుడు గ్రామాల్లో 60 శాతం లైట్లు మాత్రమే వెలుగుతున్నాయని అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి రూ.482 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉందని..గత 5 ఏళ్లుగా ఆ నిధులు విడుదల చేయకపోవడం వల్ల కొత్త లైట్లు ఏర్పాటు, నిర్వహణ మూలన పడిందని అధికారులు తెలిపారు. అయితే దశల వారీగా ఈ చెల్లింపులు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల భవనాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని సీఎం సూచించారు. అలాగే గ్రామాల్లో చేపట్టే నరేగా పనులపై ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా గ్రామ సభలు నిర్వహించాలన్నారు. కొత్త వ్యవస్థలు వచ్చినా గ్రామ సర్పంచిని గౌరవించుకోవాల్సిన అవసరముందని సీఎం అన్నారు. గత ప్రభుత్వ తీరువల్ల మూలనపడ్డ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాలను మళ్లీ ప్రారంభించాలని సీఎం చెప్పారు. నరేగా పనులపై చర్చించడానికి రాష్ట్ర వ్యాప్తంగా 23వ తేదీన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలన్నిటినీ తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. 2014-19 మధ్య ఎన్టీఆర్ జలసిరి కింద 32,693 బోర్లు వేసి పంపు సెట్లు బిగిస్తే...గత ప్రభుత్వం కేవలం 2,580 పంపు సెట్లు మాత్రమే ఇచ్చిందని అధికారులు వివరించారు. రానున్న రోజుల్లో 10వేల కిలోమీటర్ల డ్రైన్‌లు, 2,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని... అలాగే 5 లక్షల ఫామ్ పాండ్స్ తవ్వకాలు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని అధికారులు వివరించారు.



## ప్రజలను ప్రకృతికి చేరువ చేయండి

రాష్ట్రంలో అడవుల పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపుపై దృష్టి పెట్టాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. హార్టికల్చర్‌తో కలుపుకుని రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ బెల్ట్ సాధించాలని సీఎం అన్నారు. నగర వనం కార్యక్రమం ద్వారా 175 నియోజకవర్గాల్లో, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపు చేపట్టాలని సీఎం తెలిపారు. ప్రకృతితో ప్రజలు మమేకమయ్యే పరిస్థితి కల్పించాలని ఆయన సూచించారు. పచ్చదనం పెంచేతే ప్రజలు ఆ ప్రాంతాలకు వచ్చి సేదతీరుతారని, అలాంటి వాతావరణం కల్పించాలని సీఎం అన్నారు. రాష్ట్రంలో ఎకో టూరిజం ప్రాజెక్టులకు అనేక అవకాశాలున్నాయని, ఆ దిశగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అడవుల్లో టూరిజం అభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టాలని సీఎం సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. డిపోల్లో ఉన్న ఎర్రచందనం నిల్వలను పరిరక్షించాలని సూచించారు. 6 నెలలకు ఒక్క సారి ఎర్రచందనం వేలం నిర్వహించాలని సీఎం ఆదేశించారు. మడ అడవుల అభివృద్ధి, పరిరక్షణ కోసం రాజీ లేకుండా పనిచేయాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖలో గత కొద్ది రోజుల్లో తీసుకున్న పలు నిర్ణయాలను, సంస్కరణలను ముఖ్యమంత్రికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షలో వివరించారు. గ్రామాల ముఖచిత్రం మార్చడంలో కీలకమైన పంచాయతీ రాజ్, రూరల్ డెవలెప్మెంట్ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, నేడు మళ్లీ నిధులు, కొత్త విధానాల ద్వారా గ్రామాల్లో సమూల మార్పులు తీసుకువస్తామని ముఖ్యమంత్రికి పవన్ కల్యాణ్ తెలిపారు.



# అమరావతి నిర్మాణంలో భాగం పంచుకోండి

- ప్రపంచబ్యాంకు, ఏడీబీని కోరిన సీఎం చంద్రబాబు
- ముఖ్యమంత్రితో బ్యాంకుల ప్రతినిధుల భేటీ
- అమరావతికి రుణం మంజూరుపై చర్చ
- 27 వరకు రాజధానిలో బ్యాంకుల బృందం పర్యటన

అమరావతి(చైతన్యరథం): భవిష్యత్ మహానగరం అమరావతి నిర్మాణంలో భాగం పంచుకోవాలని ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) ప్రతినిధులను సీఎం చంద్రబాబు కోరారు. మంగళవారం.. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంపై సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. అమరావతి నిర్మాణానికి సంబంధించి మన ప్రణాళికలు, విజన్ గురించి ఈ సమావేశంలో బ్యాంకు ప్రతినిధులతో చర్చించామన్నారు. అమరావతి నిర్మాణ మహాయజ్ఞంలో భాగస్వాములవ్వాలని ఈ రెండు బ్యాంకులను కోరామని చంద్రబాబు తెలిపారు.

అంతకు ముందు సీఎం చంద్రబాబుతో జరిగిన భేటీలో ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు ఇచ్చే విషయమై ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) సంసిద్ధత వ్యక్తం చేశాయి. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ప్రతిపాదించింది. ప్రపంచ బ్యాంకు సహకారంతో ఈ నిధులు సమకూర్చేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ప్రతినిధుల బృందం సమావేశమైంది. పురపాలకశాఖ మంత్రి నారాయణతో పాటు ఆర్థికశాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అమరావతి అభివృద్ధి, ఆర్థిక సాయానికి సంబంధించిన అంశాలపై సీఎంతో రెండు బ్యాంకుల ప్రతినిధులు చర్చించారు. ప్రాథమికంగా అమరావతిలో చేపట్టాల్సిన పనులపై వారికి చంద్రబాబు సీఎం వివరించారు. రాజధానిలో ప్రభుత్వ ప్రాధాన్యతా ప్రాజెక్టులను, తమ విధాన నిర్ణయాలను బ్యాంకుల ప్రతినిధుల ఎదుట ప్రస్తావించారు. దశల వారీగా నిధుల విడుదలపై చంద్రబాబుతో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ప్రతినిధులు చర్చలు జరిపారు. అమరావతి ప్రాజెక్టులో పనుల పురోగతి, క్షేత్రస్థాయి పర్యటనలు, భూసమీకరణ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులపై ఈ సమావేశంలో చర్చించారు. కాగా రెండు బ్యాంకుల ప్రతినిధులు ఈ నెల 27 వరకు అమరావతిలో పర్యటించి, గత ప్రభుత్వ విధ్వంసం కారణంగా వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణాలను పరిశీలించనున్నారు.

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి



- ఏ ఒక్క రైతుకూ ఆదాయం తగ్గకూడదు
- అవసరమైన విత్తనాలపై 80శాతం రాయితీ
- పంటల సాగుపై రైతుకు సూచనలివ్వండి
- వాస్తవ అంచనాలను రూపొందించండి
- సేద్యం మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు
- సీమ జిల్లాల్లోని ఖాళీ భూములపై సమీక్ష

అమరావతి (చైతన్య రథం): రాయలసీమ జిల్లాల్లోని ఏ ఒక్క రైతు ఆదాయం తగ్గకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కింజ రాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. సీమ జిల్లాల్లో ఖాళీగావున్న వ్యవసాయ భూముల్లో సాగు ప్రోత్సహించడంతోపాటు రైతులకు మేలు చేకూర్చేందు కు 80శాతం రాయితీపై విత్తనాలు అందించాలని ఆదే శించారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో మంగళ వారం రాయలసీమలోని 8 జిల్లాల వ్యవసాయ ఉన్నతా ధికారులతో మంత్రి అచ్చెన్న వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. రాష్ట్రంలో డిమాండున్న పంటలకు, రైతులు కోరుకునే రకాల విత్తనాలు రాయితీపై అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాగుబడిలేని భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు పై క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలివ్వాల ని అధికారులకు తెలియచేశారు.ప్రత్యామ్నాయ పంటల వాస్తవ అంచనాలను రూపొందించాలని, రైతులకు సాధారణ సాగులో ఆదాయం తగ్గకుండా ప్రత్యమ్నాయ పంటలను సూచించాలని మంత్రి ఆదేశించారు.

సాగు దిగుబడులు తగ్గకుండా చర్యలు తీసుకోవలని అధికారులకు సూచిస్తూ.. సాధారణస్థాయి కంటే అధిక వర్షపాతం ఉన్నా సాగు మాత్రం తక్కువ విస్తీర్ణంలో నమోదవ్వడం వలన స్వల్పకాల దిగబడిపంటలు ప్రోత్స హించాలన్నారు. ఒకేసారి వర్షం అధికంగా పడడం, ఎక్కువగా డ్రై స్పెల్స్ నమోదవ్వడం వలనసాగు విస్తీర్ణం తగ్గిందని అధికారులు నివేదించారు.

రాయలసీమ జిల్లాల్లో ఇప్పటివరకు నమోదైన వర్ష పాత వివరములు వివిధ పంటల సాగు విస్తీర్ణం, పంట సాగుచేయని మిగిలిన విస్తీర్ణంలో అనుకూలమైన ప్రత్యా మ్నాయ పంటల ఎంపిక తదితర అంశాలపై చర్చించా రు. రాయలసీమ జిల్లాల వ్యవసాయ అధికారులు ఆయా జిల్లాల్లోని వ్యవసాయ క్షేత్ర పరిస్థితులను మంత్రి అచ్చెన్నాయుడుకి వివరించారు. గత ఏడాది జూన్ నుండి ఇప్పటి వరకు నెలవారీగా వాస్తవ పంటల సాగు విస్తీర్ణము, వర్షపాతము వివరించారు. వర్షం నమోదైన రోజులు తదితర పరిస్థితులను సాధారణ సాగు విస్తీర్ణ ము తదితర అంశములతో బేరీజు చేసి చర్చించారు.

రాష్ట్ర వ్యవసాయ సంచాలకుడు ఢిల్లీ రావు మాట్లా డుతూ.. రాయలసీమ జిల్లాల్లో 15,03,613 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణంనకు గాను, ఇప్పటి వరకు 11,24,351 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగ యిందని తెలుపుతూ, 3,79,262 హెక్టార్ల విస్తీర్ణంలో ఎటువంటి పంటలు సాగు చేపట్టక భూములు ఖాళీగా నమోదైందని తెలిపారు.వాటిస్థానంలో ప్రత్యామ్నాయం గా 2,22,349 హెక్టార్ల అత్యధిక విస్తీర్ణంలో ఉలవలు.. మిగిలిన విస్తీర్ణంలో పెసర, అలసందలు, జొన్న, కొర్ర, మినుము,సజ్జ పంటలను సిఫారసు చేసారని తెలిపారు. వీటిపై జిల్లా వ్యవసాయ అధికారులు 80 శాతం విత్తన రాయితీ ప్రతిపాదనలపై

ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. విత్తనాభివృద్ధి సంస్థ టెండర్ల ప్రక్రియ చివరి అంకంలో ఉందని, రానున్న రెండురోజులలో సరఫరా ఏజెన్సీలను నియమించి విత్తన పంపిణీ చేస్తామన్నారు. వ్యవసాయ పరిశోధనా సంచాలకులు పాలడుగుల సత్యనారాయణ పంటలు బెట్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు తీసుకోవలసిన చర్యలను వివరించారు. చర్చలో పాల్గొన్న అధికారులు తమ ప్రాంతంలోని రైతులు ఎక్కువమంది నవధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్నారని, వాటిని కూడా పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికార్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ.. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇస్తూ ఉండాలని ఆదేశించారు.







# భూవివాదాలపైనే ఎక్కువ ఫిర్యాదులు



- సంబంధిత శాఖ సమన్వయంతో త్వరగా పరిష్కరించండి
- సిబ్బందికి మంత్రి నారా లోకేష్ ఆదేశం
- 28వ రోజు లోకేష్ 'ప్రజాదర్బార్'కు బారులు తీరిన ప్రజలు
- బాధితుల నుంచి వినతులు స్వీకరించిన లోకేష్





అమరావతి(చైతన్యరథం): భూవివాదాలపై ప్రజల నుంచి ఎక్కువ విజ్ఞప్తులు వస్తున్నందున ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తన సిబ్బందిని విద్య, ఐటీ,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. సంబంధిత శాఖతో సమన్వయం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉండవల్లిలోని నివాసంలో 28వ రోజు మంగళవారం మంత్రి నారా లోకేష్ "ప్రజాదర్బార్"కు మంగళగిరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను విన్నవించారు. అయా విజ్ఞప్తులను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అమరావతి నిర్మాణం కోసం పెదవడ్లపూడికి చెందిన 40మంది వృద్ధులు కలిసి సేకరించిన రూ.28వేల విరాళాన్ని "ప్రజా దర్బార్" లో మంత్రి నారా లోకేష్‌ను కలిసి అంద జేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి అభినందనలు తెలిపారు.

## మంగళగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన విన్నపాలు

మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడికి చెందిన రైతులు మంత్రి నారా లోకేష్ ను కలిశారు. వైకాపా అండతో గ్రామంలోని ఉప్పలపాటి చెరువు కట్టను కొంతమంది ఆక్రమించారని, దీంతో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించి రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.

పెద్దవడ్లపూడిలో దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న 40ఎకరాల రైతు పట్టా భూములను 2010లో నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని,రికార్డులు పరిశీలించి 22-ఏ నుంచితమ భూములు తొలగించాలని గ్రామానికి చెందిన బాధిత రైతులు కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.



దివ్యాంగుడనైన తనకు ఎలాంటి ఆధారం లేదని, ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన షేక్ మౌలాలి విజ్ఞప్తి చేశారు.

చిట్యాల ఐలమ్మ రజక ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని ఉండవల్లి గ్రామానికి చెందిన రజక సోదరులు కోరారు.

బీకామ్ కంప్యూటర్స్ చదివిన తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని దుగ్గిరాలకు చెందిన చల్లపల్లి వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## మాజీ మంత్రి కాకాణి అండతో భూమిని కబ్జా చేశారు

నెల్లూరు జిల్లా సైదాపురం రెవెన్యూ పరిధిలో వంశ పారంపర్యంగా వచ్చిన తన రెండెకరాల భూమిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అండతో కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయంచేయాలని నెల్లూరుకు చెందిన రావిళ్ల శ్రీనివాసనాయుడు విజ్ఞప్తిచేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

పోలియో వ్యాధి బారినపడి మంచానికే పరిమితమైన తనకు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఎం.మల్లికార్జున రావు విజ్ఞప్తి చేశారు.

పుట్టుకతో దీర్ఘకాలిక చర్మవ్యాధి బారినపడిన తమ కుమారుడికి పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన మద్దిగుంట జగదీష్ చంద్రప్రసాద్ కోరారు.

చీరాల లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన యూనియన్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు ఆదేశాలు ఇవ్వాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. లాక్ డౌన్ సమయంలో అధికారులు రెన్యువల్ చేయలేదని, ఇప్పుడు జిల్లా మారడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం సేకరించిన తన 18సెంట్ల స్థలానికి నష్టపరిహారం చెల్లించలేదని, విచారించి తగిన న్యాయం చేయాలని విజయవాడకు చెందిన కళ్లేపల్లి కృష్ణ విజ్ఞప్తి చేశారు.

అనియత విద్య బోధక, పర్యవేక్షకులకు అర్హతను బట్టి వయస్సుతో నిమిత్తం లేకుండా విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో నియమించాలని నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్ వైజర్స్ అండ్ ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న బీఈడీ,రికార్డు ఫీజులు తగ్గించాలని ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

పార్ట్‌టైం జాబ్ ఆశచూపి నకిలీ బ్యాంక్ అకౌంట్ ద్వారా రూ.16లక్షల వరకు సైబర్ మోసానికి పాల్పడ్డారని,విచారించి తగిన న్యాయంచేయాలని తిరుపతిజిల్లా కామకూరుకు చెందిన వి.గురేష్ విజ్ఞప్తిచేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న తన కుమార్తెకు గత వైసీపీ ప్రభుత్వం విదేశీ విద్య సాయం నిలిపివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తిరిగి మంజూరు చేయాలని కృష్ణాజిల్లా నూజివీడుకు చెందిన గొల్లమందల శ్రీను కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి మినిమమ్ టైంస్కేల్ వర్తింపజేయాలని కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆయా విన్నపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.





# ఏపీలో భారీవిస్తరణకు హెచ్‌సీఎల్ సన్నాహాలు!

- మరో 15 వేల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు
- మంత్రి లోకేష్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

అమరావతి(చైతన్యరథం): ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ హెచ్‌సీఎల్ ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్‌సీఎల్ 4,500 మందికి ఉద్యోగాలు కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో భారీఎత్తున విస్తరణ చేపట్టాలని నిర్ణయించినట్లు హెచ్‌సీఎల్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శివ శంకర్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్ వెల్లడించారు. హెచ్ సీఎల్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఉండవల్లి నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌తో సమావేశమయ్యారు. ఏపీలో విస్తరణ ద్వారా మరో 5,500 మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్‌సీఎల్ ప్రతినిధులు తెలిపారు. ఫేజ్ 2 లో భాగంగా నూతన కార్యాలయ భవనం నిర్మాణం చేపట్టి మరో పది వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఐటిలో ప్రస్తుతం అంతర్జాతీయంగా చోటుచేసుకున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా అధునాతన సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న స్కిల్ సెన్సస్ , స్కిల్



డెవలప్మెంట్‌లో తాము కూడా భాగస్వామ్యం వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా విస్తరణకు కావాల్సిన కొన్ని అనుమతులు, గత ప్రభుత్వం నిలిపివేసిన రాయితీలు విడుదల చేయాల్సిందిగా హెచ్‌సీఎల్ ప్రతినిధులు మంత్రిని కోరారు.

### విడతల వారీగా రాయితీలు విడుదల చేస్తాం

మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ... గత టీడీపీ హయాంలో అనేక రాష్ట్రాలు పోటీపడగా, తాను స్వయంగా వెళ్లి హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్ శివ్ నాడార్‌తో మాట్లాడి గన్నవరంలో క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పించానని చెప్పారు. రికార్డు టైంలో అనుమతులు, భూ కేటాయింపులు చేసి, యుద్ధ ప్రాతిపదికన కార్యకలాపాలు ప్రారంభించేలా చేయడం తనకు మంచి అనుభూతిని ఇచ్చిందన్నారు. గన్నవరం వైపు వెళ్లిన ప్రతిసారీ యువతకు 4500 మందికి ఉద్యోగాలు కల్పించామన్న సంతృప్తి, సంతోషం కలిగేవని చెప్పారు. అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వ అసమర్థత కారణంగా సంస్థ కార్యకలాపాలు ముందుకు సాగలేదు. 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించాల్సిన సంస్థ కేవలం 4500 మంది వద్దనే ఆగిపోయింది. పూర్తి స్థాయి అనుమతులు, రాయితీలు ఇవ్వకుండా నిలిపివేసి ఇబ్బందులు పెట్టారు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైంది... ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన మా లక్ష్యం. మీ కంపెనీ పూర్తి సామర్థ్యంతో కార్యకలాపాల విస్తరణకు సంపూర్ణ సహకారం అందిస్తాం, ఇందుకు అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన క్లియర్ చేస్తాం, గత ప్రభుత్వంలో పెండింగ్ పెట్టిన రాయితీలను విడతల వారీగా చెల్లిస్తాం. మరో 15,500 మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా మీరు పనిచేయండి, అందుకు అవసరమైన పూర్తి సహకారం మేము అందిస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఐటిలో వస్తున్న అధునాతన మార్పులకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నందుకు హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులను అభినందించారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలే ప్రభుత్వ లక్ష్యం

- అధికారులు అలసత్వం వీడి పనిచేయాలి
- ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేకంగా రేషన్ కార్డులు, దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ ట్రై సైకిళ్లు ఇచ్చేందుకు కృషి
- బోగస్ పింఛన్లకు అడ్డుకట్ట వేయాలి
- అర్హులైన చివరి వ్యక్తి వరకు పింఛను అందించాలి
- సమీక్షలో మంత్రి డోలా స్పష్టీకరణ



అమరావతి(చైతన్యరథం): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని, ప్రభుత్వ లక్ష్యసాధనకనుగుణంగా అధికారులు అలసత్వం వీడి బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. మంగళవారం నాడు వెలగపూడి సచివాలయంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమంపై అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరాలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్‌కి కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. అంధ విద్యార్థులకు ఒకేషనల్, స్కిల్ కోర్సులు కూడా ప్రవేశపెట్టాలి. పాఠశాలలు ప్రారంభించే సమయానికే వారికి పాఠ్య పుస్తకాలు అందించాలి. ట్రాన్స్ జెండర్లు గుర్తింపు కార్డులు తీసుకునేలా అవగాహన కల్పించాలి. ట్రాన్స్ జెండర్లకి ప్రత్యేకంగా రేషన్ కార్డులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం.

ట్రాన్స్ జెండర్‌లతో స్వయం సహాయక బృందాల ఏర్పాటుకు ప్రోత్సహించాలి. వారికి స్వయంఉపాధి కల్పించి సమాజంలో గౌరవంగా బతికేలా చర్యలు చేపట్టాలి. దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలి. దివ్యాంగులకు సేవ చేసే అదృష్టం రావడం గొప్ప భాగ్యం. అధికారులు అలసత్వం వీడి బాధ్యతతో పని చేయాలి. అధికారులు సంబంధిత శాఖలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలి.

జిల్లా కలెక్టరేట్లలో జరిగే గ్రీవెన్స్‌కి ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి. బోగస్ పింఛన్లకు అడ్డుకట్ట వేయాలి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చెప్పిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన మొదటి నెల రూ.7000 పింఛన్ ఇచ్చాం. అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు పింఛన్లు అందించాలని మంత్రి డా. డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమం, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం సెక్రటరీ ఎ. సూర్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ డి.రవి ప్రకాష్ రెడ్డి, దివ్యాంగ కార్పొరేషన్ ఎండి ఎం.ఎ కుమార్ రాజా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వెలిగొండ పాపం వైసీపీదే!

- గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టు పనులు ఆలస్యం
- 50 రోజుల్లోనే పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాం
- ఏడాదిలోనే ప్రాజెక్టు పనుల పూర్తికి చర్యలు
- ప్రాజెక్టు పూర్తికి రూ.4 వేల కోట్లు అవసరం
- రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు




అమరావతి (చైతన్య రథం): గత ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే వెలిగొండ ప్రాజెక్టు పనులు అలస్యమయ్యాయి. తాము అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే ప్రాజెక్టు పనులను వేగవంతం చేసే చర్యలు చేపట్టామని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఏడాదిలోనే ప్రాజెక్టు పనులు పూర్తికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలంటే దాదాపు రూ.4వేల కోట్లు అవసరమని నిమ్మల వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి తన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి.. వెలిగొండ ప్రాజెక్టు ఆలస్యానికి తమ ప్రభుత్వమే కారణమంటూ నిందలు వేయడాన్ని ఖండించారు. జలవరుల అభివృద్ధికి గతంలో తమహయాంలో రూ.68 వేల కోట్లు వెచ్చిస్తే, గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.19 వేల కోట్లే వెచ్చించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.

తమ ప్రభుత్వం అధికారంలోని వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజక్టు పనులకు అధిక ప్రాధాన్యతనివ్వడం జరిగిందన్నారు. ఒక ఏడాదిలోనే ప్రాజెక్టును పూర్తిచేసే అవకాశాన్ని పరిశీలించమని అధికారులను ఆదేశించామన్నారు. ప్రకాశం జిల్లాకు త్రాగు, సాగునీటిని సాధ్యమైనంత త్వరగా అందించేలా యుద్దప్రాతిపదికన చర్యలు చేపట్టడమైందన్నారు. వెలిగొండ హెడ్ రెగ్యులేటర్ పనులు, మొదటి, రెండవ టన్నల్ లైనింగ్ పనులు, ఫీడర్ కెనాల్ స్ట్రక్చర్, లైనింగ్ పనులకు మరియు నిర్వాశితులకు ఆర్ అండ్ ప్యాకేజీకై మొత్తం 4వేల కోట్లు వెచ్చించాల్సి ఉందన్నారు. ఇందుకై స్టేజ్-1లో రూ.1,422 కోట్లు, స్టేజ్-2లో రూ.2,157 కోట్లు మరియు ఫీడల్ కెనాల్ స్ట్రక్చర్, లైనింగ్ పనులకు రూ.400 కోట్లు వెరసి మొత్తం రూ.4వేల కోట్లు వెచ్చించి యుద్ధపాతిపదిక పనులను నిర్వహించేందుకు చర్యలు చేపట్టడమైందన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు పెండింగ్ పనులను మంత్రి వివరిస్తూ ప్రాథమిక టన్నల్ హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి చేయకుండా నీటిని వదిలితే టన్నల్‌కే ప్రమాదం సంభవించే పరిస్థితి ఉంటుందనే కనీస పరిజ్ఞానం లేకుండా వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు వదల వచ్చని మాజీ ముఖ్యమంత్రి అనడం ఎంతో హాస్యాస్పదంగా ఉందన్నారు. మొదటి టన్నల్‌కు సంబంధించి 500 మీటర్లు, రెండొవ టన్నల్‌కు సంబంధించి 7 కి.మి. లైనింగ్ పూర్తి కాకుండానే నిర్దేశించిన నీటి పరిమాణాన్ని వదలడం సాధ్యం కాదనే విషయాన్ని కూడా అర్థం చేసుకోలేని పరిస్థితిలో గత ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. రెండవ టన్నల్‌లో త్రవ్విన 2 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని మొదటి టన్నల్ చివరి భాగాన వేయడం జరిగిందని, ఆ మట్టిని తొలగించకుండా నీటిని విడుదల చేయడం సాధ్యంకాదనే కనీస పరిజ్ఞానం కూడా మాజీ ముఖ్యమంత్రికి లేదని విమర్శించారు. రెండవ టన్నల్ 12వ కి.మి. దగ్గరున్న టన్నల్ బోరింగ్ మిషన్ చెడిపోయి ఉంటే గత మూడేళ్ళుగా బయటకు తీసువచ్చే కనీస ప్రయత్నాన్ని గత ముఖ్యమంత్రి చేయకపోగా, ఇప్పుడు ఆ టీబీఎంను బయటకు తీసుకురాకుండా ఏవిధంగా నీరు వదలగలమని ప్రశ్నించారు. రెండవ టన్నల్‌కు సంబంధించి ఇంకా 30 శాతం బెంచింగ్ పనులు నిర్వహించాల్సి ఉందని, అందుకు 50వేల నుండి లక్ష క్యూబిక్ మీటర్ల రాతి వ్యర్థాలను తొలగించాల్సి ఉందన్నారు. ఇందుకు బ్లాస్టింగ్, డ్రిల్ చేసుకుంటూ నిదానంగా నిర్వహించాల్సి ఉందని, ఎంతో సమర్థవంతంగా పనిచేస్తే ఆరు మాసాలు కాకుంటే సంవత్సరకాలం ఈ పనికి పడుతుందన్నారు. అటువంటి పనిని గత ఐదేళ్లలో ఏమాత్రం నిర్వహించకుండా ఇప్పుడు మాపై నిందనలు వేయడం ఏమాత్రం సబబని మంత్రి ప్రశ్నించారు. వీటితోపాటు 22 కి.మి. ఫీడర్ కెనాల్ లైనింగ్, విస్తరణ పనులు కూడా పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. మొదటి టన్నల్ ద్వారా 3 వేల క్యూసెక్కులు, రెండో టన్నల్ ద్వారా 8,500 క్యూసెక్కులు వెరసి మొత్తం 11,500 క్యూసెక్కుల నీరు ప్రవహించే సామర్థ్యం ఆ ఫీడర్ కెనాల్‌కు లేదన్నారు. అదేవిధంగా ఫీడర్ కెనాల్ ద్వారా 53 టీఎంసీ సామర్థ్యంగల నలమల సాగర్ రిజర్వాయరుకు నీరు చేరుకుంటుదని, అయితే ప్రస్తుతం ఆ రిజర్వాయరులో అర టీఎంసీ నీటిని నిల్వచేసే అవకాశం కూడా లేదన్నారు. ఈ నలమల సాగర్ రిజర్వాయరువల్ల 11 గ్రామాలు ముంపుకు గురవుతున్నాయని, ఆర్ అండ్ అర్ ప్యాకేజీ క్రింద నిర్వాశితులకు దాదాపు రూ.1,100 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. గత ఐదేళ్ల కాలంలో కనీసం కోటి రూపాయలు కూడా చెల్లించలేదన్నారు.

2021 జూలై 15న కేంద్ర జలవనరుల శాఖ హంద్రీ-నీవా, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులను అప్రూవుడ్ ప్రాజెక్టులుగా పేర్కొంటూ, వెలిగొండను అన్ అప్రూవుడ్ ప్రాజెక్టుగా గజిట్ జారీచేస్తే గత ముఖ్యమంత్రి తన వ్యక్తిగత స్వార్థం కోసం నోరుమెదపలేదని మంత్రి నిమ్మల తప్పుపట్టారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులకు గ్రీజు కూడా పెట్టలేక పోయిందని, గేట్లు కొట్టుకుపోయాయని, సోమశిల ప్రాజెక్టు గేట్లు, షట్టర్లు రోప్స్ తుప్పు పట్టిపోయేలా చేశారని, నీరు నిండితే సోమశిల ప్రాజెక్టు గేట్లు మూస్తే గేట్లు కొట్టుకుపోతాయేమోననే ఆందోళన మాకుందని, శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు కూడా సరిగా లేకపోవడానికి కారణం గత ప్రభుత్వ నిర్లక్ష్యమేనని మంత్రి నిమ్మల విమర్శించారు.

## పారిశ్రామిక రంగంలో మహిళల పాత్ర కీలకం



- అవసరమైన వనరులకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- చిన్న మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- జాతీయస్థాయి మహిళా మేధో సంపత్తి వ్యాపార సదస్సు ప్రారంభం

అమరావతి(చైతన్యరథం): దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి చిన్న, మధ్య తరహా పారిశ్రామిక రంగంలో మహిళల పాత్ర కీలకమని, పారిశ్రామికరంగ స్వరూపాన్ని మార్చడంలో మహిళా పారిశ్రామికవేత్తలకున్న సామర్థ్యాన్ని రాష్ట్రప్రభుత్వం గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతుందని చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో రెండురోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి మహిళా మేధో సంపత్తి వ్యాపార సదస్సు- 2024ను మంత్రి మంగళవారం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం సదస్సులో మాట్లాడుతూ ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తల స్ఫూర్తికి మద్దతునివ్వడమే కాకుండా అందుకు అనుగుణమైన వ్యవస్థను రూపొందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వ్యాపారంలో మహిళలకు సాధికారత కల్పించడం, వారికి అవసరమైన వనరులు, శిక్షణ, ఆర్థిక సాయాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, పథకాలను రూపొందిస్తుందని చెప్పారు. అడ్డంకులను ఛేదించడానికి, పోటీ మార్కెట్లో విజయం సాధించడానికి అవసరమైన సాధనాలను మహిళలకు అందించడానికి తమ వంతు ప్రయత్నం ఎప్పుడూ ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. వ్యాపార వాతావరణంలో మేధో సంపత్తి యొక్క ప్రాముఖ్యత, ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యాపార విజయానికి కీలకమైన సాధనంగా ఉద్భవించిందని చెప్పారు. మహిళల నేతృత్వంలోని ఆవిష్కరణలను రక్షించడానికి, విలువను సృష్టించడానికి దీర్ఘకాలిక వృద్ధిని సాధించడానికి మేధోసంపత్తిని అర్థం చేసుకుని ప్రోత్సాహాన్ని అందించటం కీలకమని తెలిపారు. మీ విజయమే మా విజయమని, మీ ఎదుగుదల దేశం యొక్క అభివృద్ధికి గీటురాయి అని పేర్కొన్నారు. ఈ సమ్మిట్ గొప్ప విజయాన్ని సాధించాలని, వ్యవస్థాపక ప్రయాణంలో కొత్త శిఖరాలను చేరుకోవడానికి మీలో ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని, శక్తినివ్వాలని ఆకాంక్షించారు. అనంతరం కేఎల్ యూనివర్సిటీ ఇన్‌క్యుబేషన్ సెంటర్లో పలువురు రూపొందించిన నూతన ఆవిష్కరణలను మంత్రి పరిశీలించి యూనివర్సిటీ చేస్తున్న కృషిని అభినందించారు. ఎలిప్ అధ్యక్షురాలు కన్నెగంటి రమాదేవి, నారీ శక్తి అవార్డ్ గ్రహీత కనకాల రమాదేవి, కేఎల్‌యూ కార్యదర్శి కోనేరు కాంచనలత, పారిశ్రామికవేత్త కె.శేషబాబు సదస్సులో సందేశానిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు, కేఎల్‌యూ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



## పోలీసు విచారణకు జోగి గైర్హాజర్

- చంద్రబాబు ఇంటిపై దాడి కేసు

గుంటూరు: మాజీ మంత్రి జోగి రమేష్ మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు గైర్హాజరయ్యారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఇంటిపై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దాడికి సంబంధించిన కేసులో ఇదివరకే జోగి రమేష్‌ను ఒకసారి పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. మంగళవారం మరోసారి విచారణకు రావాల్సి ఉండగా.. జోగి రమేష్ గైర్హాజరయ్యారు. మాజీమంత్రి తరపున అయన న్యాయవాదులు మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. జోగి రమేష్ విచారణ రావడం లేదని లాయర్లు తెలిపారు.

కాగా... చంద్రబాబుపై ఇంటిపై దాడి కేసులో జోగిరమేష్ సహా మరికొందరికి పోలీసులు నోటీసులు అందజేశారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల విచారణకు జోగి రమేష్ హాజరుకావాల్సి ఉంది. అయితే మాజీ మంత్రి విచారణకు హాజరుకావడం లేదని జోగిరమేష్ తరపు న్యాయవాదులు పోలీసులకు తెలియజేశారు. ఇప్పటికే ఈ కేసు



విచారణను ఓపెన్ చేసిన పోలీసులు గత శుక్రవారం జోగి రమేష్‌ను మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో గంటన్నర పాటు విచారణ చేశారు. విచారణ అనంతరం జోగిని పోలీసులు ఇంటికి పంపించివేశారు.

## ఏపీలో సీబీఐ విచారణకు సాధారణ సమ్మతి

అమరావతి: రాష్ట్రంలో సీబీఐ విచారణకు సాధారణ సమ్మతి ఇస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సీబీఐ పరిధిలో నిర్దేశించిన నేరాల విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సాధారణ అనుమతి నిచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో అవినీతికి పాల్పడిన ఉద్యోగులపై, ప్రైవేటు సంస్థలపై నేరుగా విచారణ చేసేందుకు అనుమతినిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వ అనుమతితోనే విచారణ చేపట్టాలని స్పష్టం చేసింది.

చైతన్యరథం

# వెలిగొండపై ఎందుకన్ని అబద్ధాలు!

- నిలువెత్తు నిర్లక్ష్యం వైసీపీదే కదా జగన్?
- నీ వైఫల్యాలను ఎన్నాళ్లని దాచగలవు?
- ప్రాజెక్టుపై రాజకీయం చేసింది నువ్వుకాదా?
- 11 ముంపు గ్రామాలతో ఆటాడుకున్నదెవరు?
- నీ నిర్లక్ష్యంవల్లే ప్రాజెక్టుపై అదనపు భారం
- నిర్వాసితులను నట్టేట ముంచిన పాపం పోతుందా?
- పెండింగ్ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవాలు..
- ఎన్నికల స్టంట్‌కు రాష్ట్ర ప్రజలు చెక్..
- నాశనం చేసిన నోటితోనే ఇప్పుడు నీతి మాటలా?

అమరావతి (చైతన్య రథం): అధికారంలో ఉన్నంత కాలం రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించిన వైసీపీ -వెలుగొండపై అకస్మాత్తుగా ప్రేమ చూపించడం జగన్ వికృత రాజకీయానికి నిదర్శనం. కరువుతో అల్లాడే ప్రకాశం జిల్లాకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు ఫలాలను అందించడంలో వైసీపీ నిర్లక్ష్య రాజకీయమే ఇప్పుడు పెనుశాపమై కూర్చుంది. ఆ విషయాన్ని దాచిపెట్టి -వెలుగొండను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిన కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయడం వైసీపీ నికృష్ట రాజకీయానికి పరాకాష్ట. ప్రాణం పోయినా నిజాలు చెప్పకూడదని గట్టి ఒట్టు పెట్టుకున్న జగన్ -వెలుగొండపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేయడం.. ఆ ప్రాంత ప్రజలపై జగన్‌కున్న మమకారమేపాటిదో చెప్పకనే చెబుతుంది. కోవిడ్ మహమ్మారి సహా ఎదురైన ఎన్నో సాంకేతిక అవరోధాలను అధిగమించి జనవరి 2021లో టన్నెల్-1, జనవరి 2024లో టన్నెల్-2 నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి జాతికి అంకితం చేశామని 'ఎక్స్' వేదికపై జగన్ చేసిన వ్యాఖ్యలు సుద్దపూస అబద్ధాలే. వాస్తవానికి -వెలుగొండ నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా ప్రారంభోత్సవం చేయడం రైతులను మోసం చేయడమేనన్న విషయాన్ని జగన్ ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం -వైసీపీ పాలనలో ప్రాజెక్టు పనులపై ఎంతటి నిర్లక్ష్యం సాగిందో చెప్పకనే చెబుతుంది. తాము అధికారంలోకి వస్తే వెలుగొండను ఏడాదిలో పూర్తి చేస్తామని బీరాలు పలికిన జగన్ సర్కారు.. గద్దెనెక్కగానే ప్రాజెక్టును గాలికొదిలేసింది. నిజానికి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో చేసిన పనుల కారణంగానే.. వైసీపీ గద్దెనెక్కిన ఏడాదికే పెండింగ్‌లోవున్న తొలి సొరంగం తవ్వకం పూర్తైందన్న విషయం ప్రకాశం జిల్లావాసులకు తెలీంది కాదు. అప్పటకీ.. తొలి సొరంగం నుంచి ప్రాజెక్టులోకి నీరు తీసుకొనే అవకాశం ఏర్పడినా.. నిర్వాసితుల తరలింపును జగన్ నిర్లక్ష్యం చేయడంతో అదీ వీలు కాలేదు. నిర్వాసితులకు పునరావాసం కింద రూ.1300 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఇచ్చి కూడా జగన్‌రెడ్డి నిధులు విడుదల చేయకపోవడం.. ప్రాజెక్టుపై జగన్ సర్కారు అలక్ష్యాన్ని చెప్పకనే చెబుతుంది. తాను అధికారంలో ఉన్నపుడు నిధులు విడుదల చేయలేకపోయిన జగన్.. ఈ సీజన్లోనే అర్ అండ్ అర్‌కు కావాల్సిన నిధులు విడుదల చేస్తే.. ప్రాజెక్టులో వెంటనే నీరు నిల్వ చేయవచ్చని సుద్దపూస కబుర్లు చెప్పడం సిగ్గుచేటు. ఆర్ అండ్ ఆర్ కోసం వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని ప్రణాళికలు సిద్ధం చేశామని వ్యాఖ్యానించడం మరీ దారుణం. పైగా ఎన్డీయే సర్కారు వచ్చి 3 నెలలవుతున్నా నిర్వాసితులకు పునరావాసం కల్పించే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపించడం లేదని వ్యాఖ్యానించడం జగన్ అనైతిక రాజకీయానికి పరాకాష్ట. నిజానికి లక్ష్మీపురంలో వందమందికి పైగా ప్యాకేజీ అందలేదు. వారిలో 40మందికి పైగా చనిపోయారన్న విషయాన్ని కూడా జగన్ ఎక్స్ వేదికపై స్పష్టం చేస్తే బావుండేది. వెలుగొండ ప్రాజెక్టుపై జగన్ సర్కారు ఎంత అశ్రద్ధ చూపిందో చెప్పడానికి -తప్పుల తడకగా తయారైన నిర్వాసితుల జాబితా పరిశీలిస్తే సరిపోతుంది. గెజిట్లోని పేర్లు తొలగించేసి.. జగన్ ప్రభుత్వ జాబితాలో అర్హులపేర్లు లేకుండా చేశారు. వెలుగొండ ప్రాజెక్టు కార్యాలయం వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవడం కోసం నిర్వాసితులు నెలల తరబడి అర్జీలిచ్చినా పట్టించుకున్న పాపానపోలేదనడానికి ఎన్నో ఉదంతాలు. ఆ వేదన భరించలేక -వెలుగొండ ప్రాజెక్టు కార్యాలయం వద్ద దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటనను కూడా జగన్ తన ఎక్స్‌వేదికపై పోస్టుచేసివుంటే.. వెలుగొండ ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక అర్హత వచ్చివుండేది. దంపతుల ఆత్మహత్యకు, ఆ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు అనాథలవ్వడానికి జగన్‌రెడ్డి కారణం కాదా?

## 11 ముంపు గ్రామాలతో జగన్ సర్కారు గేమ్?

వెలుగొండ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి.. 11 ముంపు గ్రామలు, 7200 కుటుంబాల జీవితాలతో జగన్ సర్కారు గేమ్ ఆడింది. పైగా కమిషన్ల కక్కుర్తితో తరచూ కాంట్రాక్టర్లను మార్చడం వల్ల మరో రూ.419 కోట్లమేర ప్రాజెక్టు వ్యయం పెరిగింది. ఇంత జరిగినా.. పశ్చిమ ప్రకాశం, నెల్లూరు, పల్నాడు 3 జిల్లాల్లో 4 లక్షల 60వేల ఎకరాలకు సాగు నీరు, 15 లక్షల మందికి తాగు నీరు అందించే ప్రాజెక్టును జగన్ సర్కారు కొలిక్కి తేలేకపోయింది. ఏళ్ల తరబడి తనవల్లకాని పనులను మూడు నెలలు కూడా దాటని ప్రజా ప్రభుత్వం పూర్తి చేయలేదని నిస్సిగ్గు వ్యాఖ్యలు చేయడం జగన్‌కే చెల్లు. నిజానికి -2020 జూలైనాటికి వెలిగొండ తొలి సొరంగం ద్వారా నీరందిస్తానని 2020 ఫిబ్రవరి 20న వెలిగొండ ప్రాజెక్టు సందర్శన సందర్భంగా జగన్ చెప్పిన మాట నీటి మూటే అయ్యింది. 2022 ఆగస్టునాటికి తొలి సొరంగం, 2023 ఫిబ్రవరినాటికి రెండో సొరంగం పూర్తి చేసి నీళ్లిస్తానని 2021 అక్టోబరు 7న ఒంగోలు సభలో చేసిన ప్రకటనా నీరుగారింది. 2023 సెప్టెంబర్ నాటికి సొరంగం పనులు పూర్తి చేసి జాతికి అంకితమిస్తామని, తర్వాతే ఎన్నికలకు వెళ్తామని 2022 ఆగస్టు 23న చీమకుర్తి పర్యటనలో ప్రకటించిన జగన్.. అదీ నెరవేర్చలేదు. కప్పదాటు మాటలతో వెలుగొండను నెట్టుకురావడం తప్ప జగన్ సాధించిన ప్రాజెక్టు పురోగతి అంటూ ఏమీ లేదనడం అతిశయోక్తి కానేకాదు.

## వెలుగొండ ప్రాజెక్టు ఖర్చు..

ఐదేళ్లు వెలిగొండ ప్రాజెక్టును పట్టించుకోకుండా, పనులు పూర్తి చేయకుండా, నిర్వాసితులకు పరిహారమివ్వకుండా ఎన్నికల ముందు మార్చి 6, 2024న ప్రారంభోత్సవమంటూ జగన్ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. వెలుగొండ ప్రాజెక్టుకు ఇప్పటివరకూ వెచ్చించింది రూ.5,974 కోట్లు. అందులో జగన్ చేసిన ప్రాజెక్టు వ్యయం రూ.958 కోట్లు. ఇదీ ప్రాజెక్టుపట్ల జగన్ శ్రద్ధ. జగన్ నిర్లక్ష్యం మాట అటుంచితే.. అధికారుల అంచనా ప్రకారం ప్రాజెక్టు వ్యయ అంచనా సుమారు రూ.10వేల కోట్లకు చేరింది. అంటే ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.4వేల కోట్లు అవసరమన్న మాట.



## నిర్వాసితులను నట్టేట ముంచిన జగన్‌రెడ్డి

నిర్వాసితులను తరలించాలన్న కీలక ప్రక్రియను పూర్తి చేయకుండానే.. రెండు సొరంగాలను జాతికి అంకితం పేరిట శిలా ఫలకాన్ని జగన్ ఆవిష్కరించం నిస్సందేహంగా ప్రజలను మోసం చేయడమే. వాస్తవ లెక్కల ప్రకారం ఇంకా 7వేల మంది నిర్వాసితులకు సాయం అందాల్సి ఉంది. పెద్దారవేడు, మార్కాపురం, అర్ధవీడు మండలాల్లోని 11 ముంపు గ్రామాలను తరలించాల్సి ఉంది. నిర్వాసితులకు రూ.1,500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. కాని వారికి పరిహారం చెల్లించకుండా జగన్‌రెడ్డి ఐదేళ్లు నెట్టుకొచ్చాడు. విచిత్రమేమంటే.. భూములు, ఇళ్ల స్థలాలిచ్చిన రైతులను ప్రారంభోత్స వానికి రావద్దంటూ పోలీసుల చేత నోటీసులు ఇచ్చిన నీతిమాలిన చరిత్రను జగన్ పోగేసుకున్నాడు.

## పెండింగ్ పనులు పూర్తికాకుండానే ప్రారంభోత్సవాలా?

నిర్వాసితుకు పరిహారం ఇవ్వలేదు. రెండో సొరంగం వ్యాసార్ధం తగ్గించి మ్యాన్యువల్‌గా తవ్వి ఫీడర్ కాలవ లైలింగ్ పనులు పూర్తి చేయలేదు. కొల్లంవాగు హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రాజెక్టు రివిట్‌మెంట్ పనులు పూర్తి కాలేదు. డిస్ట్రిబ్యూట రీ కాలువలు, వంతెనలు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. సొరంగాల లోపల లైనింగ్ పూర్తికాకుండా, ఈ పనుల పూర్తికి మరో మూడేళ్లు పడుతుందని తెలిసినా.. ఎన్నికల స్టంట్ కోసం ప్రాజెక్టును ప్రారంభించడం జగన్ మార్క్ రాజకీయం.

## టీడీపీ హయాంలో పూర్తైన పనులు

ముఖ్యమంత్రి చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాల్లో వెలిగొండను చేర్చి ప్రత్యేక దృష్టి సారించడం ఆ ప్రాంతవాసులకు తెలీంది కాదు. పోలవరంతో పాటు వెలిగొండపైనా తరచూ సమీక్షలతోపాటు ప్రాజెక్టును సందర్శించి వాస్తవ పరిస్థితుల అధారంగా కాంట్రాక్టర్లను మార్చి పనుల్లో వేగం పెంచారు. 2014 నాటికి 11 కిలోమీటర్లు తొలి సొరంగం పూర్తి కాగా తర్వాత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లకాలంలో దాదాపు 17.78కిలోమీటర్లు తవ్వడంతోపాటు అత్యంత క్లిష్టమైన హెడ్ రెగ్యులేటరీ పనులు పూర్తి చేశారు. టీడీపీ హయాంలో మొదటి టన్నెల్ 90.96 శాతం పనులు, రెండో టన్నెల్ 65 శాతం పూర్తయ్యాయి.

## ఇదీ జగన్ నిర్వాకం!


నిర్మాణంలో ఉన్న హంద్రీనీవా, కల్వకుర్తి, నెట్టెంపాడులను యథావిధిగా పూర్తి చేయాలని అప్రూవల్ చేసిన ప్రాజెక్టులను జూలై 15, 2021న కేంద్ర జలవనరుల శాఖ గెజిట్ విడుదల చేసింది. దీనిలో వెలిగొండను అన్ అప్రూవ్డ్ ప్రాజెక్టుగా పేర్కొంది. గెజిట్‌పై అభ్యంతరాలుంటే 6నెలల లోపల తెలియజేయాలని కేంద్రం చెబితే జగన్ రెడ్డి పట్టించుకోలేదు. వెలిగొండ అన్ని అనుమతులున్న ప్రాజెక్టుగా పునర్ముద్రించేలా చర్యలు తీసుకోమని జగన్ ప్రభుత్వానికి, కేంద్రానికి టీడీపీకి అనేకసార్లు విన్నవించుకున్నా దగా పాలకుడి సర్కారు నిర్లక్ష్యాన్నే ప్రదర్శించింది.

## బడ్జెట్‌లో నీటిపారుదలశాఖ ఖర్చు

2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు బడ్జెట్ ఖర్చు చేయగా.. అందులో ఇరిగేషన్‌కు రూ.68 వేల కోట్లు ఖర్చు చేశారు. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు బడ్జెట్ ఖర్చు చేయగా అందులో ఇరిగేషన్‌కు కేవలం రూ.32 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇందులోను సగం అవినీతి చేశారు.

పోలవరం పునరావాసంలో రూ.100 కోట్లు అవినీతి చేశారని హైదరాబాద్ ఐఐటీ అధ్యయన రిపోర్టులో పేర్కొంది. గండికోట పునరావాసంలో అవినీతిని ప్రశ్నించిన మాజీ సైనికుడు శ్రీనివాసరెడ్డిని వైకాపా గూండాలు హత్య చేశారు. చట్టవిరుద్ధమైన అవులపల్లి ప్రాజెక్టు పేరుతో పెద్దిరెడ్డికి రూ.600 కోట్లు దోచిపెట్టారు.

ఇలా జగన్‌రెడ్డి చేసిన ఖర్చులో సగభాగం అవినీతి పాలైంది. తన తండ్రి హయాంలో జలయజ్ఞాన్ని ధనయజ్ఞం చేసిన జగనే.. కృష్ణాజలాల్లో మిగులు జలాలపై హక్కు కోరమని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు లేఖ ఇచ్చి రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల గొంతు కోశాడు. ఈ ద్రోహాన్ని కప్పిపుచ్చుదానికి వెలిగొండపై జగన్‌రెడ్డి ఆకస్మిక అబద్ధాల ప్రేమను ఎక్స్‌పై వ్యక్తం చేయడం సిగ్గుచేటు!



# పర్మినెంట్ చేయకుండా వైసీపీ మోసగించింది

- విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన
- పక్క జిల్లాల్లో డ్యూటీలపై హెూంగార్డుల వినతి
- జీతాలు రాలేదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గోడు
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి వినతిపత్రాలు
- అర్జీలు స్వీకరించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి



మంగళగిరి(చైతన్యరథం): వైసీపీ అధికారంలోకి వస్తే తమను క్రమబద్ధీకరిస్తామని చెప్పి చేయకుండా మోసం చేసిందని విద్యుత్ ఉద్యోగులు వాపోయారు. పెంచిన అరియర్స్ కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. 25వేల మంది కాం ట్రాక్టు కార్మికులం ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో డిస్కంలలో చాలీచాలని జీతంతో పనిచేస్తున్నా మని తమను పర్మినెంట్ చేసి యాజమాన్యాలనే నేరుగా వేతం ఇచ్చేలా చూడాలని, 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మంగళవారం కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి, బుచ్చిరాం ప్రసాద్‌లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యను వివరించారు. అలాగే ఏపీ జెన్‌కోలో కార్మిక సంఘాలకు గుర్తింపు ఇవ్వకుండా అణిచివేతకు పాల్పడుతోందని పవర్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ఫిర్యాదు చేశారు.అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు చెప్పుకునేందుకు అర్జీదారులు తరలివచ్చారు.

– తాను పరుగుపందెంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో 26 పతకాలు సాధించినట్లు.. పై స్థాయికి వెళ్లడానికి తన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపాలిటీ పెదనాల్లా బజారు చెందిన షేక్ అబ్దుల్లా విన్నవించాడు. తన తండ్రి తోపుడు బండితోనే తమ కుటుంబం బతుకుతోందని, తనకు ఒలంపిక్స్‌లో ఆడి దేశానికి రాష్ట్రానికి మంచి పేరు తెచ్చేందుకు క్రీడా శిక్షణకు నెలకు రూ.15 వేల వరకు ఖర్చు అవుతుందని సాయం చేయాలని కోరాడు.

– తాము చిత్తూరు జిల్లాలో హెూంగార్డులుగా పనిచేస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వం ఆర్డర్ కారణంగా సొంతజిల్లాను వీడి 120కిలోమీటర్ల అవతల అన్నమయ్య జిల్లాలో తమను పనిచేయమని చెబుతున్నారని చిత్తూరు నుంచి వచ్చిన హెూంగార్డులు వాపోయారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను వీడి మరొక జిల్లాలో పని చేయడానికి ఇబ్బందిగా ఉందని సొంత జిల్లాలోనేఉండేలా సహకరించాలని మంత్రికి వినతిపత్రం అందిచారు. దీనిపై మంత్రి స్పందించి చిత్తూరు జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి సమస్య పరిష్కా రానికి కృషి చేశారు.

– గత ఐదేళ్లు వైసీపీకి కొమ్ముకాసిన చంద్రమౌళి అనే వ్యక్తి నేడు టీడీపీలో చేరి వైసీపీ నేతలతో తిరుగుతూ ఎస్సీలకు పదవులు దక్కకుండా చేస్తున్నారని దాంతో టీడీపీకి ఎస్సీలు దూరం అయ్యే అవకాశం ఉందని పార్టీ పెద్దలు నిజమైన కార్యకర్తలకు న్యాయం చేయాలని ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలం శింగనపాలెం కు చెందిన టీడీపీ నేత శివరామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

– గత ప్రభుత్వంలో లోకేష్ జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసినందుకు తన హెూటల్‌ను మూసివేయించి మాస్క్ పెట్టుకోలేదని తమపై తప్పుడుకేసులు పెట్టి వేధించారని,కేసులను తొలగించాలని తంబళ్లపల్లె వాసి ప్రకాష్‌బాబు విజ్ఞప్తి చేశాడు.

– చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ మాకాంబాపురం గ్రామానికి చెందిన చెంగ్రాయరెడ్డి సమస్యను వివరిస్తూ గ్రామానికి చెందిన పశువుల మేత పోరంబోకు, కాలువ పోరంబోకు కుంటల పొలాలను హరిరామ్ అనే వ్యక్తి ఆక్రమించుకుకుని తమ పొలానికి దారి లేకుండా చేశాడని ఫిర్యాదు చేశాడు.

– 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లుగా ఉన్న తమను 2023లో నియమించారని, ఉపాధి కోసం వేరు వేరు జిల్లాలకు వెళ్లి స్థిరపడిన తమకు పరీక్ష రాసిన జిల్లాల్లో ఉద్యోగాలు కల్పించడంవల్ల కుటుంబాలకు దూరమై వయసు రీత్యా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరిష్కరించాలని విన్నవించుకున్నారు.

– తమకు గత కొన్ని నెలలుగా జీతాలు రావడం లేదని, జీతాలు వచ్చేలా చూడాలని ఆప్కాస్ ద్వారా విశాఖ కేజీహెచ్, అనకాపల్లి మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న గ్రూప్ 4 ఉద్యోగులు విజ్ఞప్తిచేశారు. దీనిపై ఎమ్మెల్సీ అశోక్‌బాబు అధికారులతో మాట్లాడి సమస్యను తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.

– తాము సహకార బ్యాంకుల అభివృద్ధికి అవిశ్రాంతంగా పనిచేశామని, తమకు రిటైర్‌మెంట్‌కు ముందు మూడేళ్ల మాత్రమే బ్యాంకు స్కేల్ ఇచ్చారని డీసీసీ స్పెషల్ క్యాడర్ రిటైర్డ్ ఉద్యోగులు తెలిపారు. పనిచేసిన 35 ఏళ్ల కాలానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యో గుల్లా జీతభత్యాలు చెల్లించాలని కోరారు. తాము 1000 మంది ఉద్యోగులం ఉన్నామని న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.







# నిర్లక్ష్యానికి మూల్యం తప్పదు!



- బీసీ వెల్ఫేర్ హాస్టళ్ల నిరంతర పర్యవేక్షణ
- బాధ్యతల నిర్వహణలో అధికార్లు అప్రమత్తం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మంత్రి సవిత

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో అధికారులు, వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్ సవిత సూచించారు. బాధ్యతల నిర్వహణలో అధికార్లు అలసత్వం చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయట ఆహారం హాస్టళ్లలోకి రానివ్వొద్దన్నారు. విద్యార్థులు బయటకు వెళ్లకుండా చూడాలని, హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సురక్షితమైన నీటినే తాగునీటిగా అందించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం... రుచికరమైన భోజనం, అల్పాహారం అందించాలని సూచించారు. పాడైపోయిన, పాచిపోయిన ఆహారాన్ని విద్యార్థులకు అందివ్వొద్దన్నారు. వార్డెన్లు రాత్రిళ్లు హాస్టళ్లలోనే బస చేయాలని మంత్రి తెలిపారు.జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు హాస్టళ్లను సందర్శిస్తూ... కిందిస్థాయి సిబ్బందిని పర్యవేక్షిస్తూ ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. ఇష్టారాజ్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున, బీసీ గురుకులం కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

**మంత్రులతో సవితమ్మ భేటీ**

ఇదిలావుంటే రాష్ట్ర విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామిని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్.సవిత సచివాలయం 3వ బ్లాకులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయామంత్రుల కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసిన సవితమ్మ.. ఇరువురు మంత్రులతో సత్యసాయి జిల్లాతో పాటు పెనుకొండ నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంత్రి సవితమ్మ చర్చించారు.



## శిశు సంరక్షణ కేంద్రాలకు
# ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి

- బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శిశు సంరక్షణ పునరావాస కేంద్రాలు నిర్వహణకు చట్టబద్ధమైన అనుమతులు తప్పనిసరి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలలహక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తూ.. స్వచ్ఛంద సంస్థల ముసుగులో నిరుపేదలు,అనారోగ్య పిల్లలను చేరదీసి.. వారిని చూపించి స్వదేశీ, విదేశీ సంస్థల నుంచి నిధులు వసూలు చేస్తున్న ఉదంతాలు కమిషన్ దృష్టికి వచ్చాయన్నారు. దాతలు సమకూర్చిన నిధులను బాలల సంరక్షణకు వెచ్చించకుండా.. పిల్లల భద్రతనుగాలికి వదిలేయడంతో బాలలు మృత్యువాత పడుతున్నట్లు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి బోగస్ కేంద్రాల భరతం పట్టేలా జిల్లా స్థాయి అధికారులుకు ఆదేశాలు జారీ చేస్తున్నట్టు తెలిపారు. కొన్ని అనధికార కేంద్రాల్లో కలుషిత ఆహారం, మానసిక ఒత్తిడిలు, లైంగిక వేధింపులు, మృత్య వాతలు, అక్రమ రవాణా, అవయవ మార్పిడివంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వెలుగులోకివస్తున్నాయని, వీటిని పూర్తిస్థాయిలో నివారణకు క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

గ్రామ సచివాలయాలు, మహిళ సంరక్షణ అధికారి మరియు మండల స్థాయి అధికారులు ప్రభుత్వ అనుమతి పొందిన, పొందని శిశు సంరక్షణ, పునరావాస కేంద్రాలు, విద్యా సంస్థలను గుర్తించి ఆయా జిల్లాస్థాయి సంబంధిత అధికారులకు నెలాఖరులోపు ధృవీకరణ చేసి నివేదిక సమర్పించాలన్నారు.ముఖ్యంగా విద్యాశాఖ, సంక్షేమ శాఖలు, పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్యశాఖ, సచివాలయం సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించి చట్టబద్ధతలేని కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కేసలి సూచించారు.

# ఆధునిక సాంకేతికతతో
# ఇళ్ల నిర్మాణాల నాణ్యతా ప్రమాణాల తనిఖీ

- ముఖ్యమంత్రి ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వ సంస్థతో థర్డ్ పార్టీ విచారణ
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపర చర్యలు
- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టీకరణ



అమరావతి(చైతన్యరథం): ఆధునిక సాంకేతికతతో ఇళ్ల నిర్మాణాల నాణ్యతా ప్రమాణాల తనిఖీ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని.. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సంస్థతో థర్డ్ పార్టీ విచారణ జరుగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణం, ఐ అండ్ పీఆర్ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంగళవారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా గృహ నిర్మాణ సమీక్షా సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాతో మాట్లాడారు. ఆప్షన్-3 కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కొన్ని ఏజెన్సీలు బేస్‌మెంట్ వరకు పనిచేసి పేమెంట్స్ తీసుకున్నాయని.. ఆ తర్వాత పని ఎగ్గొట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.అదేవిధంగా మరికొన్ని ఏజెన్సీలు నాణ్యత లేకుండా నిర్మాణాలు చేసినట్లు తెలిసిందన్నారు.ఫిర్యాదులపై త్వరలోనే విచారణ నివేదిక రానుందని.. నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టపర చర్యలుతీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.మెటీరియల్ దుర్వినియోగం చేసినా, పరిమితికి మించి మెటీరియల్ తీసుకున్నా,ఉద్దేశ పూర్వకంగా లబ్ధిదారులకు నష్టం చేకూర్చినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో 100రోజుల కార్యాచరణ కింద లక్షా 25వేల ఇళ్ల నిర్మాణాల పూర్తికి, అదే విధంగా 7లక్షల ఇళ్లను రాబోయే ఏడాది కాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పీఎంఏవై-1.0..వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తవుతున్న నేపథ్యంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులను ప్రోత్సహించి ఆలోగా నిర్మాణాల పూర్తికి అనువైన వాతావరణాన్ని ఏర్పరుస్తున్నట్లు తెలిపారు. గడువు ముగిస్తే భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం చేజారుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు అదనపు సహాయం అందించే విషయమై ముఖ్యమంత్రితో చర్చించనున్నట్లు తెలిపారు. 500లోపు ఇళ్ల నిర్మాణాలు చేపట్టే మేస్త్రీల గ్రూపులకు ర్యాండమ్ తనిఖీలు చేసి చెల్లింపులు చేయ నున్నట్లు వెల్లడించారు.

మైలవరం నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల పరంగా చాలా ఇబ్బందులు ఉన్నాయని.. కొన్ని స్థలాలు నివాస యోగ్యంగా లేవని, అదే విధంగా అక్కడికి వెళ్లేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని, మరికొన్ని నిర్మాణాలకు అనువుగా లేవని శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చారని.. ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ప్లింత్ పూర్తయ్యాక ఫిల్లింగ్ చేసేందుకు మట్టికోసం ఇబ్బంది ఉన్న దృష్ట్యా ఫ్లైయాష్ ఫిల్లింగ్‌కు గృహ నిర్మాణ శాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది పటిష్టంగా కూడా ఉంటుందని వివరించారు. 2014-19 మధ్యకాలంలో పూర్తయిన ఇళ్లకు చెల్లింపుల విషయంలో ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయని.. ఈ సమస్యను పరిష్కరించి నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం చాలా ఆనందం కలిగిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే

పేదలకు ఇళ్ల నిర్మాణం అనేది రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతాంశంగా ఉందని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఇదే విషయాన్ని స్పష్టం చేశారని, ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందేనని మంత్రి పార్థసారథి స్పష్టంచేశారు.మంగళవారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంత్రి కొలుసు పార్థసారథి నేతృత్వంలో గృహ నిర్మాణంపై జిల్లాస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఎండీ పి.రాజాబాబు, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, మైలవరం, తిరువూరు శాసనసభ్యులు వసంతకృష్ణ ప్రసాద్,కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ తదితరులు హాజరుకాగా.. జిల్లాలో మంజూరైన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్లు, తదితరాలను కలెక్టర్ సృజన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.ఎన్‌టీఆర్ జిల్లాలో పీఎంఏవై అర్బన్(బీఎల్‌సీ) కింద 1,08,836 ఇళ్లు మంజూరు కాగా..ఇప్పటికే 18,820 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. అదే విధంగా 40,536 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందన్నారు. పీఎంఏవై-గ్రామీణ్ కింద 6,567 ఇళ్లు మంజూరు కాగా..2,127 ఇళ్లు పూర్తయ్యాయని వివరించారు. నరేగా కాంపోనెంట్, మెటీరియల్ స్టాక్, లేఅవుట్లలో మౌలిక వసతులు,ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలు, నియోజకవర్గాల వారీగా ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి తదితరాలను కలెక్టర్ వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలు, వాటిని చేరుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పార్థసారథి దిశా నిర్దేశం చేశారు.

## లబ్ధిదారులను ప్రోత్సహించాలి

వివిధ లేఅవుట్లలో విద్యుత్, నీరు, అంతర్గత రహదారులు,తదితర వసతులుఉన్నందున త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు అధికారులు చొరవచూపాలని, ఇందులో భాగంగా లబ్ధిదారులను ప్రోత్సహించాలని మంత్రి పార్థసారథి సూచించారు. గృహ నిర్మాణం, డీఆర్‌డీఏ, మెప్మా, మునిసిపల్, డ్వామా, లీడ్ బ్యాంక్, మండల, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, తదితరులు సమన్వయంతో పనిచేయాలన్నారు.ఏదైనాసమస్య ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయాలన్నారు.ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ కొరతలేకుండా చూసుకోవాలన్నారు. ఎన్‌టీఆర్‌జిల్లాలో పీఎంఏవై అర్బన్ (బీఎల్‌సీ), గ్రామీణ్ పరిధిలోదాదాపు 9వేల ఇళ్ల నిర్మాణాలు లింటెల్ లెవెల్, రూఫ్ లెవెల్, రూఫ్ క్యాస్ట్ లెవెల్‌లో ఉన్నాయని.. 100 రోజుల ప్రణాళికలో భాగంగా వీటిని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మిగిలిన ఇళ్లనిర్మాణాల పూర్తికి చొరవ చూపాలన్నారు. ఎక్కడైనా ఫిల్లింగ్‌కు సమస్యలు ఉంటే ఫ్లైయాష్‌ను కూడా ఉపయోగించుకోవడంపై దృష్టి సారించాలన్నారు. నిర్దేశిత డిజైన్ ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చూడాలని.. క్షేత్రస్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షణ అవసరమని స్పష్టంచేశారు. అవసరం మేరకు అర్బన్ లే అవుట్ల మౌలిక వసతులకు సంబంధించి అమృత్ ప్రాజెక్టులను రూపొందించాలని మంత్రి పార్థసారథి సూచించారు.

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు మైలవరం, తిరువూరు శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు తమ తమ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇళ్ల నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ, ఏజెన్సీల పనితీరు, లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన తదితరాలపై ఎంపీ మాట్లాడగా.. చెల్లింపుల్లో 2019కి ముందు జరిగిన ఇళ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం,భూసేకరణ, గృహ నిర్మాణశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది కొరత, సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణాలు, గృహ నిర్మాణ సామగ్రి, ఆప్షన్-3 ఇళ్లు తదితరాలపై శాసనసభ్యులు సమావేశంలో చర్చించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన అంశాలనుముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు.

సమావేశంలో హౌసింగ్ చీఫ్‌ఇంజనీర్ జీవీ ప్రసాద్, ఎన్‌టీఆర్ జిల్లా హౌసింగ్ పీడీ రజనీకుమారి, ఆర్‌డీవోలు బీహెచ్ భవానీశంకర్, ఎ.రవీంద్రరావు, కె.మాధవి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఇంజనీర్లు, మండల, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.





- గుర్తింపు లేని పాఠశాలలు, వసతి గృహాలు నడిపే వారిపై కఠిన చర్యలు
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడి

# మరణించిన ఏకలవ్య టీచర్ల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున ఆర్థిక సహాయం, ఉద్యోగం

అమరావతి(చైతన్యరథం):పార్వతీపురం మన్యంజిల్లా సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో ఏకలవ్య పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు వాగుదాటుతూ మృతి చెందడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ వారికుటుంబాలకు రూ.15లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అదేవిధంగా ఆ రెండు కుటుంబాల్లో కుటుంబం నుంచి ఒకరు చొప్పున ఇద్దరికి ఉద్యోగం ఇస్తామని మంత్రి సంధ్యారాణి చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని పబ్లిసిటీ సెల్లో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో ఏకలవ్య పాఠశాలకు చెందిన మహేష్(29), కీర్తి(26) అనే ఉపాధ్యాయులు వాగు దాటుతూ దురదృష్టవశాత్తూ మృతి చెందారన్నారు. సోమవారం వారి మృతదేహాలు దొరికాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆయా మృతదేహాలను విమానంలో తీసుకువెళ్లి వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. కేంద్ర సాయంగా రూ.10 లక్షలు, రాష్ట్ర సాయంగా రూ.5లక్షలు మొత్తం రూ.15 లక్షలను ఒక్కొక్క కుటుంబానికి అందజేస్తామన్నారు. అదే విధంగా ఆయా కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగం కూడా ఇవ్వడంతో పాటు, అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె తెలిపారు.

## గుర్తింపులేని పాఠశాలలు, వసతి గృహాలు నడిపేవారిపై కఠిన చర్యలు

అనకాపల్లిజిల్లా కోటవురట్ల మండలంలోని ప్రైవేటు వసతి గృహంలో ముగ్గురు చిన్నారులు కలుషిత ఆహారం తిని మృతిచెందిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించారని మంత్రి తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఆ ప్రైవేటు వసతి గృహంలో ఉన్న విద్యార్థులు అందరినీ దగ్గర్లోని ప్రభుత్వ వసతి గృహంలో చేర్పించి చదువుకునే అవకాశాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపులేని పాఠశాలలు, వసతి గృహాలు ఉంటే వెంటనే వాటిని గుర్తించి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఆమె తెలిపారు.వారి ఆదేశాల మేరకు అన్నిజిల్లాల కలెక్టర్లు ఐటీడీఏ పీఓలు, తహసీల్దార్లు,ఎంఈఓలు, డీఈఓలనుకు తగు ఆదేశాలు జారీ చేశామని మంత్రి సంధ్యారాణి తెలిపారు.



# సాంప్రదాయేతర విద్యుదుత్పత్తికి పాలసీ రూపొందించాలి

- ఎలక్ట్రానిక్ వాహనాల ప్రోత్సాహానికి చర్యలు చేపట్టాలి
- 500 ఈవీ స్టేషన్ల ఏర్పాటు దిశగా సిద్ధం చేయాలి
- సోలార్ ప్యానెళ్ల తయారీ పరిశ్రమలను రప్పించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024పై దిశానిర్దేశం



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురానున్న నూతన ఇంధన పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాంప్రదాయేతర విద్యుదుత్పత్తికి రాష్ట్రంలో అనేక అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుంటే దేశంలోనే సాంప్రదాయేతర విద్యుదుత్పత్తికి ఏపీ అతిపెద్ద కేంద్రం అవుతుందని తెలిపారు.

రెన్యువబుల్ ఎనర్జీలో 2014 - 2019 మధ్య కాలంలో దేశంలోనే టాప్‌లో ఉన్న ఏపీ 2019 తరువాత వచ్చిన ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలోకి వెళ్లిపోయిందన్నారు. రాష్ట్రంలో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ, బయో ఎనర్జీకి ఉన్న అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగేలా కొత్త పాలసీ ఉండాలని సూచించారు.

పర్యావరణ హితంగా టెక్నాలజీ ఉపయోగంతో తక్కువ ఖర్చుతో విద్యుదుత్పత్తి సాధించేలా పాలసీ రూపకల్పనపై చర్చించారు. ఈ పాలసీ ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చేలా వినియోగ దారులకు తక్కువ ధరకే విద్యుత్ సరఫరా చేసే విధంగా చూడాలని సూచించారు. వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాల్లో సాంప్రదాయేతర విద్యుదుత్పత్తికి అనుసరిస్తున్న ఉత్తమ విధానాల ను మరింత విస్తృతంగా స్టడీ చేసి కొత్త పాలసీకి రూపకల్పన చేయాలని ఆదేశించారు. 2029కి, 2047 నాటికి విద్యుత్ అవసరాలు, ఉత్పత్తిని మదింపు చేసి పాలసీ సిద్ధం చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ప్రోత్సహించేందుకు తీసుకో వాల్సిన చర్యలపైనా చర్చించారు. రాష్ట్రంలో కనీసం 500 చోట్ల ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు, సంస్థలు స్వయంగా సోలార్ విద్యుదుత్పత్తి చేసు కోవడం, తమ అవసరాలు తీరిన తరువాత మిగిలిన విద్యుత్‌ను అమ్ము కోవడాన్ని సులభతరం చేసేలా పాలసీ తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో లభించే క్వార్ట్జ్ ఖనిజం ద్వారా సోలార్ విద్యుత్ ప్యానెళ్లు తయారు చేస్తారని, ఈ కారణంగా సోలార్ ప్యానెళ్ల తయారీ పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించే అంశంపైనా దృష్టిపెట్టాలని సూచించారు.

## వైఎస్సార్ శవం సాక్షిగా పుట్టిన పార్టీ వైసీపీ

- అధికారం కోసం సంతకాల సేకరణ చేసిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి
- రాష్ట్రంలో ఎక్కడ శవం కనిపించినా గద్దల్లా వాలి శవరాజకీయాలు
- ఆనాడు ఫుడ్ పాయిజన్ ఘటనలపై ఎందుకు నోరు మెదపలేదు?
- పాయకరావుపేట ఘటనపై సీఎం రంగంలోకి దిగితే విమర్శలా?
- ఇప్పుడు కొత్త అవతారంతో రాబందుల పార్టీగా మారింది
- టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ధ్వజం



విజయవాడ(చైతన్యరథం):రాష్ట్రంలో ఎక్కడ శవం కనిపించినా సరే అక్కడ గద్దల్లా వాలిపోయి శవ రాజకీయాలకు తెరతీస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ధ్వజమెత్తారు.వైఎస్సార్ శవం సాక్షిగా పుట్టిన పార్టీ వైసీపీ అని, అధికారం కోసం తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని సంతకాల సేకరణ చేసిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు శవరాజకీయం చేసిన పార్టీ కొత్తఅవతారం ఎత్తి రాబందుల పార్టీగా మారిందన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా సిగ్గు లేకుండా టీడీపీ, చంద్రబాబు మీద బురద జల్లుతున్నారని మండిపడ్డారు. పాయకరావుపేటలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు చనిపోతే దానిపై కూడా జగన్‌రెడ్డి అండ్ కో శవ రాజకీయాలకు తెరతీశారన్నారు. అనాథ శరణాల యంలో జరిగిన ఘటన ప్రభుత్వం దృష్టికి రాగానే ముఖ్యమంత్రి వెంటనే స్పందించి విచారణకు ఆదేశించి బాధితులకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.10లక్షలు అర్థిక సాయం అందించారని తెలిపారు. అంతేగాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనాథ శరణాలయాల్లో కూడా తనిఖీలు చేపట్టి అవసరమైతే ప్రభుత్వ పరిధిలోకి తీసుకునేలా ప్రణాళికలు చేపడుతున్నారని చెప్పారు.బాధితుల కోసం స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే రంగంలోకి దిగితే దీనిపైకూడా వైసీపీ శవరాజకీయాలు చేయడం ప్రారంభించిందని ధ్వజమెత్తారు.

### ఆనాడు ఫుడ్ పాయిజన్ ఘటనలపై ఎందుకు నోరు మెదపలేదు?

జగన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో ఆయన సొంత నియోజకవర్గం పులివెందుల చక్రాయపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో బాధపడుతుంటే తమాషా చూసిన జగన్‌రెడ్డికి కనీసం మాట్లాడే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి హయాంలో పశ్చిమగోదావరి జిల్లాలో పాల కోడేరులో 21మంది ఫుడ్ పాయిజన్‌కు గురైతే ఒక్కరిని కూడా పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. 160మంది విద్యార్థులకు సరైన చికిత్స లేక కలుషిత ఆహారంతో విలవిలలాడి పోయారన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 35మంది జగనన్న గోరు ముద్ద తిని అస్వస్థతకు గురైతే కనీసం దానిని పట్టించు కోలేదని, కనీసం విచారణకు ఆదేశించింది కూడా లేదని తెలిపారు. పోలవరంలో కలుషిత ఆహారం తిని 36 మంది మంచం పడితే విచారణకు దిక్కు లేదని, ఒక్క అధికారిని సస్పెండ్ చేసింది లేదని, ఇలాంటివి జగన్‌రెడ్డి హయాంలోనే ఎన్నో జరిగాయన్నారు. పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థులు సరైన చికిత్స అందక విలవిలలాడిపోతే అవేమీ ఆనాడు జగన్‌రెడ్డికి కనిపించలేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి సంబంధం లేదని వాటిని కూడా ప్రభుత్వానికి ఆపాదిస్తున్నారని, రాయలసీమ బిడ్డను అని చెప్పుకుంటూ రాయలసీమలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగితే ఎందుకు నోరు మెదపలేదు? అని ప్రశ్నించారు. ఇన్ని జరిగినా జగన్‌రెడ్డి నోరు మెదపలేదు కాబట్టే ప్రజలు ఆయనను ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచారని వ్యాఖ్యా నించారు.

## అన్ని జిల్లాల్లోనూ చేనేత ఎగ్జిబిషన్లు

- గాంధీ బునకర్ చేనేత వస్త్ర మేళా విజయవంతం
- 14 రోజుల్లో రూ.20 కోట్ల టర్నోవర్
- మంత్రి సవిత వెల్లడి



విజయవాడ(చైతన్యరథం): విజయవాడలో 14 రోజుల పాటు నిర్వహించిన గాంధీ బునకర్ చేనేత మేళా విజయవంతమైందని, ప్రజల నుంచి వచ్చిన స్పందనను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో మిగిలిన జిల్లాలోనూ చేనేత వస్త్ర ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ నెల ఏడో తేదీ నుంచి నగరంలోని మారిస్ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న గాంధీ బునకర్ జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన మంగళవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, 14 రోజుల పాటు నిర్వహించిన చేనేత వస్త్ర మేళా విజయవంతం కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా నేతన్నలకే ఆర్థిక మేలు కలగజేయాలన్న ఉద్దేశంతో ఈ ప్రదర్శన నిర్వహించామన్నారు. తమ లక్ష్యం నెరవేరిందన్నారు. 14 రోజుల పాటు రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల రూపాయల మేర అమ్మకాలు జరిగాయన్నారు. మొత్తంగా రూ.20 కోట్ల అమ్మకాలు జరగడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల్లో చేనేత వస్త్రాల పట్ల ఆదరణ పెరిగిందన్నారు. ప్రజలంతా నేతన్నలకు అండగా ఉండాలని, వారానికి ఒకరోజు ప్రజలంతా చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ చేనేత మేళాను ప్రారంభించడంతో పాటు భువనమ్మ కోసం రెండు చీరలు కొనుగోలు చేయడంతో వస్త్ర ప్రదర్శనకు విపరీతమైన ప్రచారం లభించిందన్నారు. దీంతో ప్రజలు చేనేత వస్త్రాల కొనుగోలుకు అసక్తి చూపారన్నారు. దీనివల్ల వల్ల గతంలో ఎన్నడూ లేని విధంగా చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగాయన్నారు. మరోసారి సీఎంగా చంద్రబాబు అధికారంలోకి రావడంతో చేనేత పరిశ్రమకు స్వర్ణ యుగం వచ్చిందన్నారు. 2014-19లో చేనేత రంగ అభివృద్ధికి అమలు చేసిన అన్నీ పథకాలను అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. గడిచిన 5 ఏళ్లలో రాష్ట్రంలో చేనేత రంగం పూర్తిగా నిర్వీర్య మైందన్నారు.



### ఆకట్టుకున్న చేనేత ఫ్యాషన్ షో

చేనేత వస్త్రాలకు మరింత ప్రాచుర్యం కల్పించాలన్న ఉద్దేశంతో చేనేత, జౌళి శాఖాధికారులు నిర్వహించిన సంప్రదాయమైన చేనేత వస్త్రాలతో యువతీయువకుల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా చేనేత వస్త్రాలతో రూపొందించిన ఫ్రాక్‌లు, గౌన్లతో యువతుల ఫ్యాషన్ వాక్ విశేషంగా ఆకట్టుకుంది. యువతులతో కలిసి మంత్రి సవిత ఫ్యాషన్ వాక్‌లో పాల్గొన్నారు. దీంతో సభికులంతా హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.

### అలరించిన నృత్య రూపకం

డాక్టర్ పద్మజారెడ్డి ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. పద్మజారెడ్డి బృంద సభ్యులను మంత్రి సవిత సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత, కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పవన్ మూర్తి, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు సీఈవో వీఆర్ నాయక్, జేడీ కన్నబాబు, చేనేత కార్మికులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

# అయినా.. ఉపేక్షించాలా!?

జగన్ ఒక మాజీ ముఖ్యమంత్రి. పులివెందుల ఎమ్మెల్యే. ఉనికిలేని వైసీపీకి నాయకుడు. ఇదే -జగన్ జీర్ణించుకోలేకపోతున్న అంశం. 'వై నాట్ 175' అంటూ మిడిసిపడిన మోతుబరిని.. 11 సీట్లకు పరిమితం చేసి ఘోరపరాభవాన్ని కట్టబెట్టారు రాష్ట్ర ప్రజలు. ప్రజలు కొడితే తీసుకుంటామని పైకి గాంభీర్యాన్ని పలికే జగన్.. జనంకొట్టిన దెబ్బను తీసుకోలేకే.. కూటమిపై విషం చిమ్ముతున్నాడన్నది కాదనలేని వాస్తవం. గద్దెమీదుండగా వ్యవస్థలపై ఉక్కుపాదం మోపి.. ప్రజాస్వామ్యం స్థానంలో రాక్షస రాజ్యాన్ని ఆవిష్కరించింది జగనే. కార్యనిర్వాహణా యంత్రాంగాన్ని లొంగదీసుకుని.. రాష్ట్ర ప్రజలను ఎన్ని విధాలుగా ఇబ్బందులు పెట్టాలో అన్ని విధాలుగా ఇబ్బందులు పెట్టిందీ జగనే. ప్రజలు, ప్రతిపక్షాలన్న విచక్షణ విస్మరించి.. నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో భయవిహ్వాలులను చేసిందీ జగనే. ఇదేమిటని నిరసించిన ప్రజలను ఊచకోత కోశాడు. ప్రశ్నించిన ప్రతిపక్షాలపై ఉక్కుపాదం మోపాడు. ప్రజాస్వామ్యానికి పాతరేసి రాష్ట్రంలో మారణహోమాన్ని సృష్టించిన జగన్ జమానాలో వివిధ సామాజికవర్గాలకు చెందిన 2,686 మంది ఉసురుతీసిందీ జగనే. అడ్డుపడితే బంధువులనైనా గొడ్డలివేటుకు తెగేసి.. హంతకులను భుజాలనెక్కించుకునే విష రాజకీయ సంస్కృతి వేళ్లూనుకున్నది జగన్ ఏలుబడిలోనే! నియంతలు సైతం ఉలిక్కిపడే భయానక రాజకీయాన్ని రాష్ట్ర ప్రజల అనుభవంలోకి తెచ్చిన జగన్‌రెడ్డికి.. అంతకుమించిన పరాభవాన్ని రాష్ట్ర ప్రజలు రిటర్న్ గిఫ్ట్‌గా ఇవ్వడమే -అతని మానసిక అస్థిమితానికి కారణం. వైఫల్యాల వాస్తవికతను జీర్ణించుకోలేకపోతున్న జగన్.. -అధికారం కోల్పోయిన తరువాతా అవే తప్పులు చేస్తూ పోవడం అతని అసమర్థ రాజకీయ ప్రజ్ఞకు పరాకాష్ట. 'అధర్మం గెలిచింది, అన్యాయం జరిగింది' అంటూ రాష్ట్ర ప్రజల తీర్పును తప్పుబడుతూ.. అధికారపక్షంపై అక్కసు వెళ్లగక్కడం.. అసత్యాల ప్రచారంతో రాష్ట్రప్రజల్లో అయోమయాన్ని సృష్టించడం.. జగన్ విచిత్ర రాజకీయ వైచిత్రికి అద్దంపట్టేదే!

> ఎందుకురా ఏడుస్తున్నావు? అంటే.. అసలు ఎగ్గొట్టడానికి అన్నాడట వెనుకటికొకడు. ఐదేళ్ల విధ్వంస పాలనకు రాష్ట్ర ప్రజలిచ్చిన ఘోర పరాభవ ఓటమినుంచి జగన్‌రెడ్డి అలియాస్ లెవెన్‌రెడ్డి నీతిపాఠం నేర్చుకున్నట్టు లేదు. పైగా కూటమి ప్రభుత్వంపై అనుక్షణం విషం జిమ్ముతోన్న జగన్ రాజకీయ దుర్నీతి చూస్తే.. అతని మానసిక ప్రవర్తనపై అనుమానాలు తలెత్తకపోవు. ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వని ప్రజాతీర్పుపై అక్కసు వెళ్లగక్కుతూనే.. ఇంకా తానే అధికారంలో ఉన్నానన్న భ్రమలనుంచి జగన్ బయటపడకపోవడం చారిత్రక విషాదం. చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం.. రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా అప్రతిహత పరుగులు తీస్తుంటే -గతకాలపు భ్రమలనుంచి బయటపడని జగన్ మాత్రం 'నేనే కనుక అధికారంలో ఉండిఉంటే..' అంటూ పరాకు మాటలు మాట్లాడటం విధ్వంస పాలకుడి మానసిక స్థితికి నిలువుటద్దమే.

## పరామర్శలలో జగన్ ప్రవర్తన..!?

ప్రజాస్వామ్య విధానంలో నియంతలు ఇమడలేరన్న విషయాన్ని జగన్ తనకుతానుగా రుజువు చేశాడు. అసందర్భ ప్రస్తావనలతో సందర్భోచితంగా రుజువు చేస్తూనే ఉన్నాడు. కష్టాలలోవున్న పార్టీ శ్రేణులను ఓదార్చాల్సిందిపోయి.. శ్రేణుల కష్టాలపైనే శవరాజకీయాలకు సాహసిస్తోన్న జగన్ తెంపరితనం వర్తమాన రాజకీయాలకు గొడ్డలిపెట్టు. తండ్రి వైఎస్సార్ పార్థివ దేహం సాక్షిగానే కపట రాజకీయా డ్రామాలకు తెరలేపిన మచ్చ జగన్‌పై లేకపోలేదు. ఇప్పుడు -పార్టీ శ్రేణులెవరైనా కన్నుమూస్తే.. ముందు బాధిత వర్గాలను ఓదార్చాల్సిందిపోయి.. శవరాజకీయాలకు తెరలేపడం జగన్ సహజ నైజాన్ని బయటపెట్టే విషయమే. పార్టీ నాయకుడిగా బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వాల్సిన జగన్.. వాళ్ల సమక్షంలోనే తాను ముఖ్యమంత్రిగా ఉండివుంటే అమ్మఒడి ఇచ్చేవాడిని, విద్యాదీవెన ఇచ్చేవాడిని, రైతు భరోసా ఇచ్చేవాడిని, సున్నావడ్డీ రుణాలిచ్చేవాడినంటూ అసందర్భ ప్రస్తావన సాగించడం జగన్ చిత్తశుద్ధిని తేటతెల్లం చేసే విషయమే. అందుకు వినుకొండ, నంద్యాల ఉదంతాలు ఉదాహరణ కాకపోవు. అందుకే -బాధిత కుటుంబాలు సైతం జగన్‌రెడ్డి శవరాజకీయాలు చూసి విస్తుపోతున్నారు. అధికారంలోవుంటే రాష్ట్రానికి అదిచ్చేవాడిని.. ఇదిచ్చేవాడినని పిట్టలదొర ప్రగల్భాలు పలికే జగన్.. కష్టంలోవున్న కుటుంబానికి రిక్తహస్తం చూపించి వెళ్లాడన్న వ్యాఖ్యానాలు బహిరంగంగా వినిపించినవే! ఇది చాలు.. ముసుగువెనుక జగన్ అసలు రూపాన్ని అంచనా వేయడానికి! జగన్‌రెడ్డి తన పార్టీకి చెందిన వాళ్లు చనిపోతే... దానికి ప్రభుత్వమే బాధ్యతని వితండ వాదన చేస్తున్నది జగనే. తన పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆధిపత్యపోరుతో కొట్టుకుని ఒకరు ప్రాణాలు వదిలేస్తే.. వినుకొండ ఉదంతపు రక్తపు మరకలను ప్రభుత్వానికి అంటించాలని ఢిల్లీ వరకూ పరుగులు తీసి బోర్లాపడ్డాడు జగన్. హత్యకు దారితీసిన పరిస్థితులను గ్రహించకుండా.. ఆ హత్యను ఏవిధంగా తన రాజకీయ మైలేజీకి వాడుకోవాలి? అనే కోణంలోనే జగన్ ఆలోచించడం అతని విరుద్ధ ఆలోచనా ప్రవర్తనకు గీటురాయి. దీన్నిబట్టి జగన్‌రెడ్డికి శవరాజకీయాలకు ఎంతగా అలవాటుపడిపోయాడో అర్థం చేసుకోవడం కష్టం కాదు. ఇదే పంథాలో నంద్యాలలోనూ జగన్‌రెడ్డి తన శవరాజకీయ డ్రామాను తెరకెక్కించాడు. కానీ బొమ్మ అట్టర్ ఫ్లాపవ్వడంతో తిరిగి బెంగళూరుకు పారిపోక తప్పలేదు!



**బిసి జనార్దన్ రెడ్డి**
రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖామాత్యులు

విద్వేష రాజకీయాలకు ఇకనైనా స్వస్తిచెప్పి.. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలంతా పునరంకితం కావాలంటూ గద్దెనెక్కక ముందే విజయసాధకుడు చంద్రబాబు ఇచ్చిన పిలుపు ఇక్కడ ప్రస్తావనార్హం. 'తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల విషయంలో వైసీపీ కక్షపూరిత చర్యలకు పాల్పడినా.. పగలను పక్కనపెట్టి నిందితులను చట్టబద్ధంగా శిక్షిద్దామని ముఖ్యమంత్రి విస్పష్టంగా ప్రకటించడం కూడా జగన్‌కు కంటగింపైంది. చంద్రబాబు పాలనకు రక్తపు చారికలు అంటించడమే లక్ష్యంగా.. కట్టు కథలను కఠిక నిజాలుగా ప్రచారం చేస్తూ.. జగన్ తన దుర్బుద్ధిని తానే బయటపెట్టుకున్నాడు. హూ కిల్డ్ బాబాయ్, కోడికత్తి, గులకరాయి.. డ్రామాల మాదిరిగానే.. వైసీపీపై అధికారపక్ష దాడుల డ్రామాను రక్తికట్టిద్దామనుకున్న జగన్ ప్రణాళిక పారలేదు. అయినా.. ఫేక్ డ్రామాల రాజకీయానికే అలవాటుపడిన జగన్.. ఏదోకవిధంగా బాబు పాలనపై బురదజల్లే ప్రయత్నాలను ఇంకా కొనసాగిస్తూనే ఉండటం దారుణం.

## నిన్ను లెవెన్‌రెడ్డిని చేసింది ఇందుకే..!

సొంత కుటుంబంతోనే ఛీ కొట్టించుకున్న విఫలుడు జగన్‌రెడ్డి. రాజకీయంగా నిలబెట్టిన తల్లిని, చెల్లిని.. అదే స్వార్థ రాజకీయం కోసం నడివీధికి లాగాడు. అన్నగా న్యాయం చేస్తాడనుకున్న బాబాయ్ కుమార్తె సునీత బెదిరిపోయే పరిస్థితి కల్పించాడు. సొంత కుటుంబాన్ని దూరం చేసుకుని.. చిన్నాన్న హంతకులను భుజానికెక్కించుకున్న జగన్ వికృత రాజకీయ వైఖరిని జనం జీర్ణించుకునేదెలా? తండ్రిని చంపిన అవినాష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరిన సునీతారెడ్డిని బెదిరించిన జగన్‌రెడ్డి సైకో మనస్తత్వం, హత్యారాజకీయానికి నిలువెత్తు నిదర్శనం. అవినాష్‌పై చర్యలు తీసుకుంటే తనపై ఉన్న కేసులకు మరో కేసు అదనంగా చేరుతుందే తప్ప, ఉపయోగం ఏమిటని జగన్‌రెడ్డి వేసిన ప్రశ్న ఒక్కటి చాలు.. వికృత పోకడ తీవ్రత తెలుసుకోడానికి. అలాంటి జగన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు, నాయకులకు న్యాయం చేస్తాడా? రాష్ట్ర ప్రజలకు న్యాయం చేయగలుగుతాడా? ఎలా నమ్మాలి? జగన్‌కు జనం నేరుగా సమస్య చెప్పుకునే అవకాశం లేకపోవడంవల్లే కదా.. సార్వత్రిక ఎన్నికల్లో తన కసిని చూపించి.. జగన్‌రెడ్డిని లెవన్ రెడ్డిగా చేసింది. ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని జగన్‌రెడ్డి పాతరేశాడు. వ్యవస్థల మూల స్తంభాలను కూలదోశాడు. నిరంకుశ పాలనతో పేట్రేగిపోయాడు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి దోచుకున్నాడు. ప్రకృతి వనరులను దోచేసి పర్యావరణాన్ని కుప్పకూల్చాడు. పోలీసు వ్యవస్థను ప్రైవేటు సైన్యం చేసిందీ... తాను నివసించే ప్రిజన్ హోమ్ (జైలు కొంప)కు కాపలా పెట్టుకున్నదీ జగనే. తన ప్రిజన్ హోమ్‌కు వచ్చిన వాళ్లకు లెవన్‌రెడ్డి పెట్టిన ఎగ్‌పఫ్‌ల ఖరీదు అక్షరాలా రూ.3,62,56,700లు. ఇది అత్యంత కక్కుర్తి దోపిడీ. ప్రపంచంలోనే ఓ విచిత్రమైన దోపిడీ అంటూ మీడియా కోడై కూసింది. ఇక శాండ్, ల్యాండ్, వైన్, మైన్, చివరకు కరోనానూ జగన్ వదల్లేదు. లక్షల కోట్ల ప్రజాధనం దోచుకుతున్న జగన్‌రెడ్డి... ఇప్పుడు ఏమీ ఎరుగని అమాయకుడిలా సుద్దపూస కబుర్లు చెబుతుంటే ప్రజలు వింటారా? సహిస్తారా? అందుకే ప్రజా ప్రభుత్వంపై జగన్ విసిరే రాళ్లను ప్రజలు జాగ్రత్త పెడుతున్నారు -మరోసారి చావుదెబ్బ కొట్టడానికి.

ఎన్ని ఛీత్కారాలు ఎదురైనా -జగన్‌రెడ్డి మారడుగాక మారడు. అందుకే -ప్రజలే జాగ్రత్తపడాలి. రాష్ట్ర పునర్నిర్మాణానికి అంకితమైన ప్రజా ప్రభుత్వంపై జగన్‌రెడ్డి చిమ్ముతోన్న విషాన్ని ప్రజలే తిప్పికొట్టాలి. జాలిచూపించి ఐదేళ్లు అధికారమిచ్చినందుకు రాష్ట్రాన్ని మూడు దశాబ్దాల వెనక్కినెట్టిన కంటక పాలకుడిని ఉపేక్షించడం ఎంతమాత్రం సహేతుకం కాదు. ఎవరి పాలనలోనైతే రాష్ట్రం వికసిస్తుందని ప్రజలు బలంగా నమ్మారో.. ఆ నాయకుడు చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి చిగురులు తొడుగుతోంది.

రాష్ట్రానికి పెట్టుబడులపై ఆశావహ వాతావరణం కనిపిస్తోంది. రాష్ట్ర యువత వలసలు ఆగాయి. ఉపాధి అవకాశాలపై నమ్మకం పెరుగుతోంది. తాజాగా శ్రీసిటీలో 15 కంపెనీలకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. కొన్ని కంపెనీలతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. లెవన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాన్ని వదిలేసి పారిపోయిన కంపెనీల్లో ఒకటైన ఫాక్స్ కాన్ మళ్లీ నేడు ధైర్యంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. గత ఐదేళ్ల దుర్మార్గపు పాలనపై సమగ్ర విచారణకు సర్కారు సిద్ధమైంది. తప్పు చేసిన వాళ్లు తప్పించుకునే అవకాశమే లేదు. ఇది ప్రజా ప్రభుత్వం. వాళ్ల శ్రేయస్సుకు వాళ్లే సహకరించుకోవాలి. అందుకు -ఓటమి తరువాతా అభివృద్ధికి అడ్డుపడుతున్న జగన్‌లాంటి వాళ్లను తరిమికొట్టడం ఒక్కటే మార్గం!

---

## సీఎం చంద్రబాబు సూచనల మేరకు..
# స్థానిక సంస్థలకు రూ.1,452 కోట్ల నిధుల విడుదల

- **ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి**
- **గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం**
- **స్థానిక సంస్థల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

అమరావతి(చైతన్యరథం): స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు స్థానిక సంస్థలకు రూ.1,452 కోట్ల నిధులు విడుదల చేస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధితోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్న మహాత్మా గాంధీ ఆశయాలను పాటించే ప్రభుత్వం తమదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ఇప్పుడున్న ప్రజా కూటమి ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేస్తోంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకే స్థానిక సంస్థలకు మరిన్ని నిధుల విడుదలకు నిర్ణయం తీసుకున్నాం. గ్రామ పంచాయతీలకు రూ.998 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.454 కోట్లు విడుదలకు నిర్ణయం తీసుకున్నాం. ఈ నిధులతో గ్రామ, వార్డు స్థాయిల్లో పనులను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ నిధుల విడుదలతో స్థానిక సంస్థలకు ఆర్థికంగా వెసులుబాటు కలిగే అవకాశం కలుగుతుంది. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తే.. ప్రజా కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా పని చేస్తోందని మంగళవారం ఒక ప్రకటనలో మంత్రి కేశవ్ తెలిపారు.

---

# చంద్రబాబు నేతృత్వంలో పారిశ్రామికంగా రాష్ట్రం పరుగులు

- **మంత్రి టీజీ భరత్ ఉద్ఘాటన**
- **తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న మంత్రి**

తిరుమల(చైతన్యరథం):రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అహర్నిశలు కష్టపడతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టి.జి.భరత్ అన్నారు. మంగళవారం తిరుమల వెంకటేశ్వర స్వామిని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఎన్నో ఇబ్బందుల్లో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో అవసర మన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం అడిగిన నిధులు, ఇతర సహకారం మొత్తం కేంద్ర ప్రభుత్వం అందించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు మంత్రి భరత్ తెలిపారు. అమరావతి రాజధాని అభివృద్ధి చెందాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబును కలిసేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తా మన్నారు. ఇక కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తా మన్న హామీ నెరవేరుస్తామని తెలిపారు. కర్నూలును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

# అక్టోబరు 2న వికసిత్ ఏపీ విజన్ డాక్యుమెంట్

- ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా రూపకల్పన
- 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీతో రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం
- ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రతి జిల్లాకు కార్యాచరణ
- 28న మంత్రి మండలి ముందుకు విజన్ డాక్యుమెంట్
- వచ్చే నెల 1 నుంచి 15 వరకు ప్రజాభిప్రాయ సేకరణ
- 10 నుంచి 15 తేదీల మధ్య అవగాహన సదస్సులు
- 10 నుంచి 14 తేదీల మధ్య విద్యార్థులకు పోటీలు
- 15 నుంచి 24 తేదీల మధ్య ముసాయిదా ఖరారు
- 25న ఏపీ విజన్ డాక్యుమెంట్ తుది ముసాయిదా
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్



అమరావతి(చైతన్యరథం): వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను అక్టోబ రు 2న లాంచనంగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వెల్లడించారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 ప్రణాళిక రూపకల్పనపై మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ 2047లో భాగంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా ప్రణాళికను రూపొందిస్తున్నట్టు తెలిపారు. 2047 నాటికి ఏపీని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో పాటు 45 వేల డాలర్ల తలసరి ఆదాయంతో కూడిన 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ రాష్ట్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొంది స్తున్నట్టు చెప్పారు.

### ఈ నెల 28న మంత్రి మండలికి ఏపీ విజన్ డాక్యుమెంట్

ఈనెల 28న జరిగే రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ముందుకు వికసిత్ ఏపీ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. దీనిపై సెప్టెంబరు 1 నుంచి 15 వరకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు సేకరించడం జరుగు తుందని వివరించారు. ఈనెల 21 నుంచి 31 వరకు సంబంధిత శాఖాధిపతులు జిల్లా అధికారులకు, క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన కల్పించాలని, ఈనెల 27న జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా వచ్చేనెల 10-15 మధ్య మండల, మున్సిపల్, గ్రామస్థాయిలో అవగాహనా సదస్సులు, 10-14 మధ్య ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ అంశంపై వివిధ పోటీలు, 15న విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబరు 15-24 మధ్య ఏపీ విజన్ 2047 విజన్ డాక్యుమెంట్ ముసాయిదా ఖరారు చేసి సెప్టెంబరు 25న తుది ముసా యిదాను సిద్ధం చేయమన్నట్టు వివరించారు. 29న ముఖ్యమంత్రి ఆదేశాలను తీసుకున్న తర్వాత నీతి ఆయోగ్ సమన్వయంతో అక్టోబరు 2వ తేదీన వికసిత్ ఏపీ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి చేతులమీదగా లాంచనంగా ప్రారంభించేం దుకు చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు.

### ప్రాధాన్యతలకు అనుగుణంగా శాఖల వారీగా ప్రణాళికలు

వికసిత్ ఏపీ 2047లో భాగంగా ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రతి జిల్లాకు ఐదేళ్ల విజన్ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయడం జరుగుతుందని చెప్పారు. జిల్లాల విజన్ కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనలో భాగంగా జీరో పేదరికం, సామాజిక, భౌతిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి, జనాభా నిర్వహణ(డెమోగ్రాఫిక్ మేనేజ్‌మెంట్), సులభతర జీవన విధానం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని రూపొందించడం జరు గుతుందని వివరించారు. అదేవిధంగా శాఖల వారీగా ప్రణాళికలు తయారు చేయాల్సి ఉంటుందని తెలిపారు. వికసిత్ ఏపీ విజన్ డాక్యుమెంట్‌పై ప్రజల నుంచి అభిప్రాయాలు, స్పందనను సేకరించేందుకు, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా దీనిని మానిటర్ చేసేందుకు క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచనున్నామని, దీనిపై వివిధ సామాజిక ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈ క్యూఆర్ కోడ్‌ను గ్రామ, వార్డు సచివాలయాలు, చౌకధరల దుకాణాలు వంటి ప్రజలు ఎక్కువగా సందర్శించే ప్రాంతాల దగ్గర ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా మొబైల్ అప్లికేషన్ వాట్సప్ ద్వారా అందుబాటులో ఉంచాలని చెప్పారు. అంతేగాక వివిధ మొబైల్ నెట్‌వర్కులు ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను ప్రజలందరికీ చేర వేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### విజన్ డాక్యుమెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వికసిత్ ఏపీ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇందుకు సంబంధించి ఈనెల 23న రివైజ్డ్ ముసాయిదాను సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఐటీ కార్యదర్శి సౌరవ్‌గౌర్, విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, గ్రామ వార్డు సచివాలయాల డైరెక్టర్ హరినారాయణ, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ హిమాన్షుశుక్లా, ప్రణా ళికాశాఖ జెఎస్ అనంతశంకర్, శివప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే వర్చువల్‌గా వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

---

## జగన్ అండ్ కో.. దండుపాళ్యం బ్యాచ్

- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా అవినీతి జరిగింది
- అందుకే ఇప్పుడు రికార్డులు తగులబెడుతున్నారు
- ఒక్క శాఖలో కూడా అవినీతి చేయలేదని చెప్పగలరా?
- వైసీపీ నేతలకు టీడీపీ నేత బుద్దా వెంకన్న సవాల్

విజయవాడ(చైతన్యరథం): గత ప్రభుత్వంలో అవినీతి చేసి ఇప్పుడు వైసీపీ నాయకులు వివిధ శాఖల్లో ఫైళ్లను తగులపెట్టిస్తున్నారని టీడీపీ నేత బుద్దా వెంకన్న ధ్వజమెత్తారు. ఒక్క శాఖలో కూడా అవినీతి చేయలేదని చెప్పగలరా అని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. అడ్డగోలుగా కాంట్రాక్టులు కట్టబెట్టి వైసీపీ నేతలు, కొంతమంది అధికారులు కుమ్మక్కై దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు దమ్ముంటే పట్టుకోండి అని వైసీపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో ఉన్న పరిశ్రమలు కూడా తరలిపోయాయని, జగన్‌ను చూసి భయపడి ఒక్కరు కూడా ఏపీకి రాలేదన్నారు. ఇప్పుడు చంద్రబాబును చూసి పెట్టుబడిదారులు వస్తున్నారని తెలిపారు. వైసీపీ నేతలు మా ప్రయత్నాల వల్లే ఇప్పుడు పరిశ్రమలు వస్తున్నాయని చెప్పుకోవడానికి సిగ్గుండాలని వ్యాఖ్యానించారు. జోగి రమేష్ భూబాగోతం చూశాం.. అటాచ్ ఆస్తులను కూడా స్వాహా చేశారు. వైసీపీ పాలనలో అన్నీ అక్రమాలు, అరాచకాలే జరిగాయన్నారు. జగన్ పెద్ద పెద్ద దోపిడీలు చేశారు.. ఆయన అడుగు జాడల్లో ఆ పార్టీ నేతలు అందినకాడికి దోచుకున్నారు..ఫలానా శాఖలో మేము దోచుకోలేదని చెప్పే దమ్ము ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. ఏ శాఖ పేరు చెప్పినా నేను చర్చకు సిద్ధమని సవాల్ విసిరా రు. అసలు ప్రభుత్వ శాఖల్లో కీలక ఫైళ్లు దహనం కావడం ఏమిటో వింతగా ఉంద న్నారు. ఎవరికీ అర్థం కాని జగన్ ఆర్ట్ ఇది.. చేసిన అవినీతి బయటపడకుండా ఫైళ్లు తగుల బెడుతున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్ హయాంలో అనేకమంది అధికా రులు జైలుకు వెళ్లారు. ఇప్పుడు జగన్ కారణంగా జైలుకు వెళ్లడానికి అధికారులు క్యూలు కట్టబోతున్నారని వ్యాఖ్యానించారు. ప్రజా ధనాన్ని దోచుకున్న వైసీపీ నేతలు, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. నా సవాల్‌కు ఎవరైనా దమ్ముంటే ముందుకురావాలని వైసీపీ నేతలకు కౌంటర్ ఇచ్చారు. చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని, ఆ విషయం ప్రజలకు అర్థమైనా వైసీపీ మూర్ఖులకు అర్థం కాదని తెలిపారు.



---

## 2029నాటికి అర్హులందరికీ ఇళ్లు

- రాష్ట్ర గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి
- కంకిపాడు మండల హౌసింగ్ గోదాము తనిఖీ



మచిలీపట్నం (చైతన్య రథం): రాష్ట్రంలో ఇల్లులేని నిరుపేదలకు 2029 నాటికి ఇల్లుకట్టించి ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కంకిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని కంకిపాడు మండల హౌసింగ్ గోదామును తనిఖీ చేశారు. గోదాములో ఉన్న గృహ నిర్మాణ సామాగ్రి నిల్వ రిజిస్టర్లు, పంపిణీ రసీదులు, తదితర రికార్డులు పరిశీలించారు. గోదాముకు ఎన్ని సిమెంట్ బస్తాలు వస్తున్నాయి, ఎన్ని టన్నుల స్టీల్ వస్తుంది, తలుపులు తదితర సామాగ్రి ఎంత మేరకు వస్తోంది, ఎంతమందికి సామాగ్రి పంపిణీ చేశారు తదితర వివరాలను హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కంకిపాడు గోదాముకు 1,16,881 బస్తాల సిమెంటురాగా 1,16,182 బస్తాలు లబ్ధిదారులకు పంపిణీ చేశామని, ఇంకా 699 బస్తాలు నిల్వ ఉన్నట్టు అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. అలాగే 8,13,290 కిలోల స్టీలు అందగా 6,83,692 కిలోల స్టీలు పంపిణీ చేశామని, 1,29,598 కిలోల నిల్వ ఉందన్నారు.

ఒక్కో లబ్ధిదారునికి 90 బస్తాల సిమెంటు, 485 కిలోల స్టీలు దశలవారీ అందజేయడం జరుగుతుందనని, లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న 1.8 లక్షల రూపాయల్లో పట్టుకోవడం జరుగుతుందని హౌసింగ్ అధికారులు వివరించారు. గోదాముకు అందిన గృహ నిర్మాణ సామాగ్రి సజావుగా నమోదు చేసి అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, నిల్వ వివరాలు ఏమాత్రం తేడాలేకుండా రికార్డులు పక్కాగా నిర్వహించాలని మంత్రి అధికారులకు సూచించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో గృహ నిర్మాణం కోసం నిర్ణీత కాలవ్యవధి ప్రకారం లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ఆ ప్రకారం ఈ ఏడాది 1.25 లక్షల ఇళ్లనిర్మాణం పూర్తి చేయాలని, వచ్చే ఆగస్టు మాసాంతంలోగా 7 లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇదివరకే మంజూరైన ఇళ్లను పూర్తి చేసేందుకు అన్ని విధాల కృషి చేస్తామన్నారు. లబ్ధిదారులు కూడా వారికి మంజూరైన ఇళ్లను వచ్చే మార్చిలోగా పూర్తి చేసుకోవాలని, లేకపోతే వారికి తదుపరి ఎటువంటి ఆర్థిక సహాయం అందించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే జిల్లాల వారీగా గోదాములు తనిఖీ చేసి అధికారులతో సమావేశాలు నిర్వహించి గృహ నిర్మాణ పురోగతిని సమీక్షించడం జరుగుతుందన్నారు. కంకిపాడు గోదామును రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌తో కలిసి తనిఖీ చేసి గృహ నిర్మాణ సామాగ్రిని పరిశీలించామన్నారు. పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ కొన్ని సూచనలు చేశారని వాటిని పరిగణలోనికి తీసుకుంటామన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో విఎంసీ ఇళ్లు నాణ్యతగాలేవన్నది తమ దృష్టికి వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇళ్ల నాణ్యతను తనిఖీ చేస్తామని.. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ సంస్థకు బాధ్యతలు అప్పగిస్తున్నానున్నారు. గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటారని మంత్రి వివరించారు. టిడ్కో ఇళ్ళను పూర్తి చేస్తే చంద్రబాబుకు పేరొస్తుందన్న అక్కసుతో గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును నిర్వీర్యం చేసిందని మంత్రి కొలుసు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది టిడ్కో ఇళ్లను నూటికి నూరు శాతం పూర్తి చేసి లబ్దిదారులకు అప్పగిస్తామన్నారు.

తనిఖీలో మంత్రి వెంట రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మొయిదిన్ దివాన్, మేనేజింగ్ డైరెక్టర్ పి రాజాబాబు, ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్, హౌసింగ్ సీఈ జివి ప్రసాద్, ఎస్ఈలు జయ రామాచారి, నాగభూషణం కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల హౌసింగ్ పీడీలు జీవీ సూర్యనారాయణ, రజిని, ఉయ్యూరు ఆర్‌వో డి రాజు తదితరులు పాల్గొన్నారు.



## బయటపడుతున్న పెద్దిరెడ్డి పాపాలు

◆అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక అక్రమాలు, అరాచకాలు

◆మండిపడ్డ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

విజయవాడ (చైతన్యరథం): అధికారాన్ని అడ్డుపెట్టుకొని గత ఐదేళ్లలో అనేక అక్రమాలు, అరాచకాలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్పడ్డారని, ఇప్పుడు ఆ పాపాలు రోజురోజుకు బయటపడుతున్నాయని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దిరెడ్డి బాగోతాన్ని నిగ్గుతేల్చాలని, ఆయన కుటుంబం అక్రమాలపై విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని దేవినేని ఉమా డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎక్స్ వేదికగా దేవినేని ఉమామహేశ్వరరావు స్పందించారు. 'మట్టి, ఇసుక, భూములు, అడవులు నరికివేత ఇలా ప్రతిదాంట్లో పెద్దిరెడ్డి దోపిడికి పాల్పడ్డారని, దోచుకోవడమే లక్ష్యంగా పనిచేశారు. మైనింగ్ పై గుత్తాధిపత్యం ఆయనదే. గనులను గుంజుకున్నారు.. మట్టి, ఇసుకను అదే పనిగా తోడేసిన ఘనుడు. అడవులు నరికేసి ప్రకృతి సంపద కొల్లగొట్టడంలో మహానేర్పరి. విద్యుత్ ప్రాజెక్టులన్ని ఆయన గుప్పెట్లోనే. వేల ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను కబ్జాచేశారు. మద్యం తయారు చేసేది.. దాన్ని ఏపీఎస్ బీసీఎల్ తో కొనిపించేది ఈయన కుమార రత్నమే. సాక్ష్యాలను కాల్చేస్తే అక్రమాలు బూడిద అవుతాయా? జగన్మోహన్‌రెడ్డి కనుసన్నల్లో జరిగిన అంతులేని అవినీతి స్కాములపై నారా చంద్రబాబునాయుడి ప్రభుత్వం విచారణ చేస్తుంది. తీరని ధన దాహంతో దోచిన సొమ్మును రాష్ట్ర ఖజానాకు రప్పిస్తాం.' అని దేవినేని ఉమామహేశ్వరరావు ట్వీట్ చేశారు.



బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ

## గోడపత్రికలను ఆవిష్కరించిన కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం (చైతన్యరథం): గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, బ్రూ సెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు సంబంధించి గోడపత్రికలను, వ్యాక్సిన్ క్యారియర్లు ఎమ్మెల్యే జగదీశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. పశు వైద్యాధికారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈనెల ఆగస్టు 20తేది నుంచి వచ్చే నెల సెప్టెంబర్ 18 తేదివరకు నియోజకవర్గ స్థాయిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందుబాటులో ఉంటాయని, నియోజకవర్గంలోని పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశువైద్య అధికారి మాట్లాడుతూ... మొదటి రోజు గుమ్మలక్ష్మీపురం, దుడ్డుఖల్లు, గొరడ మరియు పలుగ్రామాల్లో వ్యాధి యొక్క లక్షణాలను గురించి, వ్యాధి వలన కలిగే నష్టాలు గురించి రైతులకు వివరిస్తూ వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలి. ఈ వ్యాధికి టీకాయే మార్గము అని సూచించారు. పశువైద్యాధికారితో పాటు సిబ్బంది టీకాలు వేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి, వారి సిబ్బంది, నాయకులు పోలూరు శ్రీనువాసరావు, అడ్డాకుల నరేష్, కొటేశ మన్మథ, తదితర నాయకులు పాల్గొన్నారు.

# వివక్ష లేకుండా అభివృద్ధి చేస్తా

◆ఎమ్మెల్యే గద్దె రామమోహన్

◆13వ డివిజన్‌లో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



విజయవాడ, చైతన్యరథం: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఎటువంటి వివక్ష లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి ఎన్నికల్లో ఓట్లు తక్కువగా వచ్చిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టకుండా వివక్ష చూపారని అన్నారు. ఎటువంటి వివక్ష లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారని అన్నారు.

మంగళవారం 13వ డివిజన్ న్యూ ఆర్టీసీ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. డివిజన్‌లోని మెగా టౌన్ షిప్ వెనుక రోడ్డులో రూ.37 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ఈ కాలనీకి ప్రత్యేకత ఉందని, కాలనీవారంతా కలిసికట్టుగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకుంటారని చెప్పారు. ఈ కాలనీలో 2 రోడ్లు నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి రూ. 37 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. గతంలో ఉన్న ఎంపీ ఇక్కడ సుమారు 10 కోట్ల రూపాయాలను కేటాయించారని, వాటికి అంచనాలు కూడా రూపొందించకుండా వైఎస్సార్సీపీ నాయకులు వ్యవహరించారని అన్నారు. డ్రైనేజీ పనులు చేయకపోవడంతో వ్యర్థాలను తొక్కుకుంటూనే నడుస్తుండడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఎక్కడా కూడా వివక్షత లేకుండా అభివృద్ధి, సంక్షేమం చేయాలని చెప్పారన్నారు. నియోజకవర్గంలోని కొండ ప్రాంతంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించకుండా అడ్డుకున్న చరిత్ర వైఎస్సార్సీపీదని అన్నారు. ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే నిర్మాణ పనులను అడ్డుకునేవారు కాదన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో కాలనీలన్నింటిని అభివృద్ధి చేస్తామన్నారు. 2014లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్న సమయంలో కార్పొరేషన్‌పై ఆర్థిక భారం పడకుండా కార్పొరేషన్ జీతాలను 010 పద్దు ద్వారా ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించేలా చేశారన్నారు. దీనివల్ల సంవత్సరానికి సుమారు రూ.200 కోట్ల ఆర్థిక భారం కార్పొరేషన్‌పై తప్పిందన్నారు. ఆ నిధులతో కార్పొరేషన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేసుకోవచ్చునని చెప్పారు.

కార్పొరేటర్ మమ్మునేని ప్రసాద్ మాట్లాడుతూ 13వ డివిజన్‌లో రెండు రోడ్లను నిర్మించడానికి రూ.37 లక్షల వ్యయంతో పనులు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రూ.37 లక్షల వ్యయంతో రోడ్లను నిర్మాణం చేశామని చెప్పారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో కాలనీ అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాలనీలోని అన్ని రోడ్లను సిమెంట్ రోడ్లగా మార్పు చేస్తామని చెప్పారు. కాలనీవాసులకు ఆకతాయిల సమస్య ఎక్కువగా ఉందని స్థానిక మహిళలు చెప్పారని, ఈ సమస్యలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చర్యలు తీసుకున్నారని చెప్పారు. కాలనీవాసులు చెప్పిన ప్రతి సమస్యలను పరిష్కరిస్తామని ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు గద్దె ప్రసాద్, వీరంకి డాంగీకుమారి, వేములపల్లి శ్రీనివాస్, కొరపాటి, శ్రీనివాస్, నూతి శ్రీనివాస్, లీలా ప్రసాద్, గోపాలరావు, శేషగిరిరావు, అడ్డుకట్ల రామారావు, జావిరాజు నాని, ఈడుపుగంటి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం దిశగా కార్మిక రంగాన్ని నడిపిస్తాం

◆మత్స్యకారుడు కుటుంబానికి రూ.5 లక్షల అందచేసిన ఎమ్మెల్యే

విజయవాడ, చైతన్యరథం: వైఎస్సార్సీపీ ప్రభుత్వం కార్మిక రంగాన్ని పట్టించుకోకుండా నిర్వీర్యం చేసిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఇప్పుడు నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారని కార్మిక రంగాన్ని సంక్షేమం వైపు నడిపిస్తామని చెప్పారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్ పటమటలంక గరికపాటి వారి వీధిలో మత్స్యకారుడు మైలా వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తు మరణించగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐదు లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే గద్దె రామమోహన్ వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందచేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్



మాట్లాడుతూ పేదలకు ఎంతో ఉపయోగంగా ఉండే చంద్రన్న భీమా పథకాన్ని వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారన్నారు. వెంకటేశ్వరరావు గత ఏడాది చేపల వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు మరణించారని చెప్పారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోలేదని చెప్పారు. అందువల్ల ఈ సంఘటన జరిగి ఏడాదికి పైగా అయినా మానవతా దృక్పదంతో నారా చంద్రబాబు నాయుడు వెంకటేశ్వరరావు కుటుంబానికి రూ.5 లక్షలను అందచేశారని చెప్పారు. ఎవరైనా కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే చంద్రన్న భీమా పథకం ద్వారా రూ.6 లక్షలు మరణించిన వ్యక్తి పెద్దకర్మ జరిగేలోపునే అందచేశారని, మరణించిన వెంటనే రూ.10 వేలు అందచేసేవారని చెప్పారు.

చంద్రన్నభీమా పథకంతో పాటుగా కార్మికశాఖలోని నిధులతో కార్మికులకు మరింత సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతి శ్రీ, చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, సర్రా కిషోర్, అన్నాబత్తుల బాబీ, చిలకలపూడి నరసింహారావు, అన్నాబత్తుల శ్రీదేవి, పలమనేని సుబ్బారావులతో పాటు మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# నగరంలో అడ్డగోలుగా ఫ్లెక్సీలు పెట్టొద్దు

❑కార్పొరేషన్ అనుమతి ఉన్న హోర్డింగ్ బోర్డులకే కట్టండి

❑నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచన

నెల్లూరు చైతన్యరథం: నగరంలో ఎక్కడ చూసిన రాజకీయ, వ్యాపార సంస్థలకు చెందిన ఫ్లెక్సీలు అడ్డదిడ్డంగా కట్టడంతో అవి నగరవాసులను ఎంతో ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వెంటనే వాటిని తొలగించాలని నియోజకవర్గ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. కార్పొరేషన్ అనుమతి ఉన్న హోర్డింగ్ బోర్డులకే కట్టాలని పిలుపునిచ్చారు. తాను మొదటిసారి ఎమ్మెల్యే అయిన వెంటనే రాజకీయ ఫ్లెక్సీలు పెట్టొద్దని చెప్పడం జరిగిందని, నరసింహ కొండ దేవస్థానం వద్ద నా ఫోటోలతో కట్టిన ఫ్లెక్సీలను స్వయంగా నేనే చించివేశానని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం నగరంలోని 17వ డివిజన్, హరనాథపురం సెంటర్ లో సూర్య నమస్కారాల విగ్రహాల ఏర్పాటు పనులకు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... 'ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జిల్లా అధికారులందరి ముందు మంత్రి నారాయణకి రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు



చేయవద్దని చెప్పి, మంత్రి నారాయణని కఠిన నిర్ణయం తీసుకోమని చెప్పా. నా కార్యక్రమంలో రాజకీయ ఫ్లెక్సీలు లేకుండా చేద్దామని నేనే శ్రీకారం చుట్టా. నెల్లూరు జిల్లాలో ఉండే అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా అందరూ సహకరించండి. నా కార్యక్రమాలలో ఫ్లెక్సీలు, బొకేలు, శాలువాలు చేసేబదులు అన్న కాంటీన్ లకు విరాళం ఇవ్వండి. పదిమందికి భోజనం పెట్టినవాళ్లు అవుతారు'. అని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్ ఛార్జులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం సంకల్పానికి ప్రకృతి కూడా సహకరిస్తోంది

**◆వినుకొండ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన**

వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రతిచేనుకు నీరు, ప్రతిచేతికి పని అనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న కూటమి ప్రభుత్వం సంకల్పానికి ప్రకృతి కూడా సహకరిస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు వస్తే వానలు పడవన్న వైసీపీతప్పుడు ప్రచారాలకు జోరు వానలో వరుణుడే సమాధానం చెబుతున్నట్లు కనిపిస్తోందన్నారు. స్వల్పవ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా జలాశయాలన్నీ నిండుకుండల్లా మారాయని, పల్లెసీమలన్నీ పచ్చ తోరణంగా మారడం సంతోషంగా అనిపిస్తోందన్నారు. వినుకొండ శ్రీనివాస నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ 38వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే జీవీ అంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. అలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో జీవీ



ఆంజనేయులు, మక్కెన పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామికి జీవీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారిద్దరికి వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణను ప్రారంభించి భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయని, శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాలన్ని పూర్తిగా నిండాయన్నారు. భగవంతుడు దయతో ఈ ఏడాది పాడి పంటలు బాగా పండి అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని ఆ వేంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన యజ్ఞ యాగాలు, అన్నసమారాధన, చివరిరోజు పూర్ణాహుతి కార్యక్రమాలు బ్రహ్మాండంగా జరిగాయని ఆలయ కమిటీ నిర్వాహకులను అభినందించారు. అనంతరం మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వినుకొండ పట్టణంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు జీవీ ఆంజనేయులుకు శ్రీవారి దివ్యాశీస్సులు ఉండాలన్నారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా పడి చంద్రబాబు ప్రభుత్వంలో రైతులు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. జీవీ అంజనేయులు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పూర్తిగా లభించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కొణిజేటి నాగ శ్రీను రాయల్ పాల్గొన్నారు.



# గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి

**◆నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**

గన్నవరం (చైతన్యరథం): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తనను శాసనసభ్యునిగా ఆశీర్వదించి భారీ మెజార్టీతో అసెంబ్లీకి పంపిన గన్నవరం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గన్నవరంలో విజయవాడ రోడ్డు జాతీయ రహదారికి సమీపంలో ఏర్పాటు చేసిన నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని నిన్న రాత్రి శాస్త్రోక్తంగా వేదపండితులచే పూజా కార్యక్రమాలు నిర్వహించి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా గన్నవరం సూపర్ సిక్స్ లో భాగంగా మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామికవాడల అభివృద్ధికి పలుదఫాలుగా పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి మల్లవల్లిలో అశోక్ లేలాండ్ కంపెనీని తిరిగి పునఃప్రారంభించటానికి కృషి చేస్తున్నానని, నియోజకవర్గంలో 15వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్యను పరిష్కరించటానికి, పోలవరం కుడికాలువ 137వ కి.మీ. బండారుగూడెం నుండి ఏలూరు కాలువకు గోదావరి జలాలను తీసుకువచ్చే అనుసంధాన పథకాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వంలో 15కోట్లుతో ఇచ్చిన ఎస్టిమేషన్ 32 కోట్లకు ప్రస్తుత రేట్ల ప్రకారం రేట్లు పెంచి త్వరలోనే టెండర్లు పిలవటానికి కృషి చేస్తున్నానని, పోలవరం కుడికాలువ నుంచి గన్నవరం మండలంలోని బ్రహ్మలింగయ్య చెరువుకు గోదావరి జలాలను తీసుకువెళ్ళి రిజర్వాయరుగా మార్చటానికి ఇప్పటికే అధికారులతో చర్చించానని, రామవరప్పాడు దగ్గర ఏలూరు కాలువకు అవసరమైన చోట్ల కొత్తగా వంతెనలు ఏర్పాటు చేయటానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. నూతన కార్యాలయంలో సిబ్బంది అన్ని రోజులు అందుబాటులో ఉంటారని, వారానికి రెండు రోజులు నేను కూడా అందుబాటులో ఉంటానని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎన్.డి.ఎ. కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. నూతన కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన బి.జె.పి. జెండాను చిగురుపాటి కుమారస్వామి, తెలుగుదేశం జెండాను యార్లగడ్డ వెంకట్రావు, జనసేన జెండాను బండ్రెడ్డి రవి కార్యకర్తల హర్షధ్వానాల మధ్యన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గవ్యాప్తంగా తెలుగు మహిళ, తెలుగు రైతు, తెలుగు యువత, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జాంపేట బ్యాంకు పాలకవర్గం ఏకగ్రీవం

**◆బొమ్మన రాజకుమార్ ఆలోచనకు గౌరవం ఇచ్చాం**

**◆డైరక్టర్లలో టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ, కమ్యూనిస్టులు**

**◆మాజీ మంత్రి వేణు బీసీ మంత్రిగా అనర్హుడు**

**◆గత తప్పులు బయటపడకుండా ఫైళ్ళు కాల్చేస్తున్నారు**

**◆సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): సంప్రదాయాలను, దివంగత చైర్మన్ బొమ్మన రాజకుమార్ ఆలోచనలను గౌరవించి జాంపేట కోపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవం అయ్యేందుకు పెద్దల సహకారంతో కృషి చేశామని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో మంగళవారం బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్, వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లతో కలిసి ఎమ్మెల్యే వాసు మీడియాతో మాట్లాడారు. అధికారంఉందనే అహంకారంతో ప్రవర్తించకుండా జాంపేట బ్యాంకు అభివృద్ధి కోరుకునే పెద్దలతో సంప్రదించి అందరి ఆశీర్వాదంతో పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేశామన్నారు. చైర్మన్ బొమ్మన జయకుమార్ టీడీపీలో చేరి సహకరించారని, సహకార స్ఫూర్తికి తూట్లు పడకుండా బ్యాంకు అభివృద్ధి సాధించాలని తమ కూటమి ప్రభుత్వం కోరుకుంటోందని చెప్పారు. స్థానిక పరిస్థితులనుబట్టి పాలకవర్గంలో టీడీపీ జనసేన బీజేపీ, వైసీపీ, కమ్యూనిస్టులు ఉన్నారని వివరించారు. దీనికి మంత్రి కందుల దుర్గేష్, జనసేన నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను సహకరించారని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలనేది తమ ఆకాంక్ష అని చెప్పారు. గత వైసీపీ హయాంలో ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో దుర్వినియోగం అయిన రూ. 1.70 కోట్లపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, వారినుంచి ప్రతి రూపాయి వసూలు చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు. ఆవ భూముల కొనుగోలు అవినీతిపై సీఎంవో నుంచి సమాచారం అందిందని, రాజానగరం నుంచి మొత్తం డేటా వచ్చిందని, ఎవరి అక్కౌంటులో ఎంతపడిందనేది తేలుస్తామని, ఎవరినీ వదిలిపెట్టేదిలేదని హెచ్చరించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా దీనిపై హౌస్ కమిటీ వేయాలని అన్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన అధికారులు గతంలో చేసిన తప్పులు బయటపడకుండా ఫైళ్ళు తగలపెడుతున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మండిపడ్డారు. అధికారులు ఇప్పటికే పక్కదారిపట్టి చాలా తప్పులు చేశారని, నేరచరిత్ర కలిగిన మాజీ సీఎం జగన్ అధికారుల చేత నేరాలు, తప్పులు చేయించారని ఆరోపించారు. రూల్స్ పాటించని అధికారుల పేర్లు రెడ్ బుక్ లో ఉన్నాయని, వారందరిపై ప్రభుత్వ పరంగా చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇకనైనా అధికారులు తమ కూటమి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. బీసీసంక్షేమ శాఖ మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణకు తమ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. బీసీ హాస్టళ్ళను పట్టించుకోని వేణు ఆశాఖ మంత్రిగా అనర్హుడని విమర్శించారు. త్వరలో తల్లికి వందనం అమలు చేస్తామని, కూటమి ప్రభుత్వం అందరికీ నగదు జమ చేస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోడీ సహకరిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. జాంపేట బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్,వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్ మాట్లాడుతూ బ్యాంకు పురోభివృద్ధి సాధించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పాలకవర్గ ఎన్నికలకు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పది శాఖలు ఉన్నాయని, త్వరలో మరో నాలుగు శాఖలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. 2026లో బ్యాంకు శతవసంత వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. బ్యాంకు డిపాజిట్లు రూ.429 శనపతి కోట్లు, రుణాలు రూ.264 కోట్లు ఉన్నాయని, రూ. 695 కోట్ల టర్నోవర్ జరుగుతోందని వివరించారు. విలేకర్ల సమావేశంలో డైరెక్టర్లు ద్వారా పార్వతిసుందరి, బీరా శ్రీనివాస్ (రాజు), పూర్ణిమ ప్రసాద్, జామిశెట్టి గాంధీ, మహంతి లక్ష్మణరావు, జామి కృష్ణ,కనకం నాగేశ్వరరావు (నాని), బూర రామచంద్రరావు, యాండ్రపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారం దిశగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి అడుగులు

గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎప్పటినుండో తిష్ట వేసి ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వంలో అడుగులు వేస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గళ్ళ మాధవి తెలిపారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజలు పార్టీ నేతలు నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ రకాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు ప్రధానంగా గుంటూరు ఉద్యోగ నగర్ డెవలప్మెంట్ అసోసియేషన్ సభ్యులు తమ కాలనీలో పార్క్ అభివృద్ధి చేయాలని రోడ్లు మరియు డ్రెయిన్లు నిర్మించాలని కోరారు అదేవిధంగా వి - కన్వెన్షన్ వెనుక గంజాయి బ్యాచి రెచ్చిపోతున్నారని పెట్రోలింగ్ పెంచి తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కోరారు. సందర్భంగా ఎమ్మెల్యే అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతూ గతంలో తాను డివిజన్ పర్యటనకు వచ్చినప్పుడు పార్కును పరిశీలించాలని, రోడ్లు మరియు డ్రెయిన్లు, స్ట్రీట్ లైట్ లు తప్పకుండా ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీనిచ్చారు.



చైతన్యరథం

# త్వరలోనే స్థానిక సంస్థల సమస్యలన్నింటికీ పరిష్కారం

- రూ.1452 కోట్ల నిధులు విడుదల చేసిన చంద్రబాబు సర్కార్
- హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): ఆర్థికంగా ఉన్న సమస్యలు తొలగించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు, జవాబుదారీతనంలో రాష్ట్ర స్థానిక సంస్థలను ముందు వరసలో నిలపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన స్థానిక సంస్థలకు చెందిన రూ.1,452 కోట్లను ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో వాటికి విడుదల చేయడమే అందుకు నిదర్శనమన్నారు. ఈ విధంగా పంచాయతీలు, మున్సిపాల్టీలకు నిధుల కొరత లేకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిది అని, వాటి సాయంతో ప్రజల అవసరాలు, సమస్యలను తీర్చాల్సిన బాధ్యత మాత్రం స్థానిక సంస్థలపైనే ఉందన్నారు. చిలకలూరిపేట మెయిన్ బజార్, కేబీ రోడ్డు, మార్కెట్ రోడ్డులోని మురుగు కాల్వలను ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు. మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి నీరు రహదారిపై పారుతుందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. వర్షాలు కురిసినప్పుడు మురుగు కాల్వల్లో నీరు నిలిచి చాలా అసౌకర్యంగా ఉంటుందని చెప్పారు. మురుగు కాల్వల్లో తక్షణమే వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కాల్వలపై ఉన్న ఆక్రమణలను కూడా తొలగించాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ సెంటర్ పరిధిలో వాహనాల పార్కింగ్ స్థలం లేక రహదారిపైనే నిలుపుతున్నారని, దాంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఆ సమస్యపై కూడా దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. అధికారులంతా గత ప్రభుత్వ వాసనల్ని పూర్తిగా వదిలించుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న విషయాన్ని నిరంతరం దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడించారు.

**వసతిగృహాల్లో సౌకర్యాల లేమి ఉంటే చర్యలు : పుల్లారావు**

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ వసతిగృహాల్లో సమస్యలు, సౌకర్యాల లేమి ఉన్న సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. అనకాపల్లి హాస్టల్ ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలోని హాస్టళ్లు, వసతిగృహాలు, అనాథాశ్రమాలపై నిశిత దృష్టి సారించారని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారాయన. పురుషోత్తపట్నంలో గిరిజన సంక్షేమ పాఠశాల, వసతిగృహాన్ని మంగళవారం ప్రత్తిపాటి పుల్లారావు తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి సమస్యలు అడిగి తెలుసుకున్నాను. ఈ సందర్భంగా వసతుల కల్పనలో నిర్లక్ష్యం గురించి విద్యార్థులు ప్రత్తిపాటి ఎదుట ఏకరవు పెట్టారు. వారి సమస్యలన్నీ సావధానంగా విన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాఠశాల, వసతిగృహంలో సమస్యలు, వసతుల కల్పనపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లారు. ఆమెతో ఫోన్ లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు.



# గుంటూరు తూర్పులో మొదలైన అభివృద్ధి

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (చైతన్యరథం): గుంటూరు తూర్పులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అభివృద్ధి పనులు మొదలయ్యాయని గుంటూరు తూర్పు దిశ మారబోతుందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళవారం ఐదో డివిజన్ రామిరెడ్డితోట 3,4 లైన్లో 49.80 లక్షల నిధులతో నిర్మిస్తున్న నూతన మంచినీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో అన్ని వార్డుల్లో ప్రతి ఇంటికి వాటర్ పైప్‌లైన్ ఉండాలని మున్సిపల్ అధికారులు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఏ ఒక్కరికి నీటి సమస్య లేకుండా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మటన్ శివారుల్లో ఉండే వారికి కూడా మంచినీరు అందాలని ఆ దశగా మా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిలక వెంకటేశ్వర్లు, కోట పిచ్చిరెడ్డి, ఉప్పలపాటి మునీ, జానీ, జాగర్లమూడి శ్రీనివాస్, సలాం, ఖుద్దుస్, రాజేష్ తదితర అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టుపై మాట్లాడే అర్హత జగన్‌రెడ్డికి లేదు

- చంద్రబాబు కృషితో ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయి
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్

విజయవాడ, చైతన్యరథం: రాష్ట్రంలో వెలుగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌రెడ్డికి లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ విమర్శించారు.



వెలుగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే పూర్తిచేసినట్టు జాతికి అంకితం చేసి ప్రజాధనం దుర్వినియోగం చేసిన ఘనుడని అన్నారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెలుగొండ నిర్వాసితులను మోసం చేసిన పాపం జగన్‌దే అని అన్నారు. 2019లో జగన్ మాయమాటలు నమ్మి ప్రజలు గెలిపిస్తే ఆ ప్రజలనే మోసం చేశాడన్నారు. ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ తన తీరు మార్చుకోకుండా పిచ్చి పేలాపనలు చేస్తున్నారని, ఇకనైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని ఆయన హితవు చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా కేసులు పెట్టి వేధించలేదా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తుంటే ఓర్వలేక జగన్ విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. శ్రీ సిటీలో ఒక్కరోజే 15 పరిశ్రమలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించడం రాష్ట్రానికి శుభ పరిణామమని అన్నారు.

# రాష్ట్ర పండుగగా శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు

- అక్టోబర్ 15న శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం
- అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాల వెల్లడి




విజయనగరం (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి, విజయనగరం ప్రజల ఆరాధ్య దేవత శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ ఏడాది సెప్టెంబర్ 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.వి.వి.ప్రసాదరావు వెల్లడించారు. సెప్టెంబర్ 20న ఉదయం 8 గంటలకు చదురుగుడి వద్ద పందిరి రాట, మండల దీక్షతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, అదే రోజు ఉదయం 11 గంటలకు వనం గుడి వద్ద ప్రారంభం అవుతాయని తులిసానేజ అక్టోబర్ 30వ తేదీన వనంగుడి వద్ద ఉదయం 8 గంటలకు నిర్వహించే చండీ హోమం, పూర్ణాహుతి, దీక్ష విరమణతో ఉత్సవాలు ముగియనున్నాయని పేర్కొన్నారు. అక్టోబర్ 14వ తేదిన తోలేళ్ల ఉత్సవం, అక్టోబర్ 15వ తేదీన ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన సిరిమాను ఉత్సవం జరుగుతాయని తెలిపారు. శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల వివరాలను మంగళవారం మీడియాకు వివరించారు. అమ్మవారి అర్ధ మండల దీక్షలు అక్టోబర్ 10 నుంచి ప్రారంభం అవుతాయని, అక్టోబర్ 22న పెద్ద చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తామని, 29న ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహిస్తామని చెప్పారు. అక్టోబర్ 27న కలశ జ్యోతి ఊరేగింపు వనం గుడి వద్ద నుండి జరుగుతుందని తెలిపారు. పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం 2019లోనే గుర్తించి ప్రకటించిందని, దీనిపై జి.ఓ. నెం. 108 జారీ చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించడం జరుగుతుందని, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి కూడా పట్టు వస్త్రాలు సమర్పన ఉంటుందన్నారు. అమ్మవారి జాతర ఉత్సవాల గురించి ఆలయ అనువంశిక ధర్మకర్త, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు, స్థానిక శాసన సభ్యురాలు అదితి గజపతి రాజు, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్‌లకు ఇప్పటికే తెలియజేశామని, ప్రభుత్వం తరపున ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను చేయాలని డి.వి.వి ప్రసాదరావు కోరారు.

# టీడీపీ హయాంలోనే విజయవాడ అభివృద్ధి

- ఐదేళ్లుగా అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ నేతలు
- మండిపడ్డ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం) : 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. మంగళవారం సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 61వ డివిజన్ దేవినేని గాంధీపురం, పాయకాపురం చెరువు పార్క్ ఏరియా, వాంబే కాలనీ ఎచ్ బ్లాక్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... సెంట్రల్ నియోజకవర్గంలో 2019 నుండి 2024 వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని పార్కులు, పాడైపోయిన రోడ్లను పరిశీలించి తక్షణమే పనులు ప్రారంభించి అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. 'వాంబే కాలనీ నుండి ఇన్నర్ రింగ్ రోడ్డుకు కనెక్టివిటీ గా ఉన్న 80అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు దానిని గత ఐదు సంవత్సరాలుగా ఎటువంటి రోడ్డు వేయకుండా గుంటలుగా వదిలేయడం రాత్రిపూట ఈ రోడ్లమీద తాగుబోతులు, గంజాయి తాగేవాళ్లు తిరుగుతూ చుట్టుపక్కల ప్రజలకు చాలా అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. గతంలో 2019లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండంగా ఈ రోడ్డుకు శంకుస్థాపన చేశామని తరువాత ఎలక్షన్ కోడ్ రావడంతో పనులు ఆగిపోయినయని తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డు మీద కనీసం గుంటలు కూడా పూడ్చలేదు. తిరిగి 2024 తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ రోడ్డుకు పున:పూర్వవైభవం తీసుకురావడానికి అడుగులు ముందుకు వేస్తున్నామని దీనికి అయ్యే ఖర్చును అధికారులతో అంచనాలు సిద్ధం చేసి పనులు మొదలు పెడతాం.' అని బొండా ఉమా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దాసరి దుర్గారావు పెప్సీ, దాసరి ఉదయశ్రీ, సీఎచ్ శ్రీనివాసరావు, పోలిశెట్టి అమ్మరావు, దాసరి కనకారావు, ఆకుల సూర్య ప్రకాష్, చింతల దుర్గాప్రసాద్, అన్నా ఐత్తుల శ్రీను, దొడ్డి చింతల ప్రాణికుమార్, వలివేటి శ్రీను, శివకుమారి, జగదీష్, సాంబశివరావు, నాగేశ్వరావు, స్వామి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన దారుణం

- ◆సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన
- ◆ఆత్మహత్య కేసుగా ఎలా సమాచారం ఇచ్చారు?
- ◆ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ తీరుపై ఆగ్రహం
- ◆ఎఫ్ఐఆర్ నమోదులోనూ ఆలస్యమేనా?
- ◆10 మందితో జాతీయ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- ◆తదుపరి విచారణ ఈనెల 22వ తేదీకి వాయిదా



ఢిల్లీ: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. దారుణం చోటుచేసుకున్న ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ తీరుపై మండిపడింది. అంత ఘోరం జరిగితే.. ఆత్మహత్య అని ఎలా చెప్పారంటూ ప్రశ్నించింది. కొన్ని మీడియా సంస్థలు బాధితురాలి ఫొటో, పేరు ప్రచురించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

విచారణ సందర్భంగా బెంగాల్ ప్రభుత్వం, కోల్‌కతా పోలీసులు, మెడికల్ కాలేజీ అధికారుల తీరుపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "ఈ ఘటనలో నేరాన్ని ఉదయాన్నే గుర్తించినట్లు తెలిసింది. కానీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మాత్రం దీనిని ఆత్మహత్య కేసుగా సమాచారం అందించే ప్రయత్నం చేశారు. ఆయన ప్రవర్తనపై అనుమానాలు ఉన్నప్పుడు.. వెంటనే మరో కాలేజీకి ఎలా నియమించారు? ఇక, ఎఫ్ఐఆర్ నమోదు కూడా ఆలస్యమైంది. మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 4 గంటల మధ్య శవ పరీక్ష పూర్తయ్యింది. కానీ, మృతదేహాన్ని అంత్యక్రియలకు అప్పగించిన 3 గంటల తర్వాత రాత్రి 11.45 గంటలకు ఎందుకు నమోదు చేయాల్సి వచ్చింది? ఆసుపత్రి అధికారులు, కోల్‌కతా పోలీసులు అప్పటివరకు ఏం చేస్తున్నారు? మృతదేహాన్ని చూపించేందుకు తల్లిదండ్రులు గంటల పాటు వేచి చూసేలా ఎందుకు చేశారు? అని సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసు దర్యాప్తు చట్టపరమైన స్థితి నివేదికను ఈనెల 22కల్లా సమర్పించాలని కోర్టు సీబీఐని ఆదేశించింది.

### పని ప్రదేశంలో భద్రత ఉండాలి

మహిళలు ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి లేకపోతే, పనిచేసే ప్రదేశంలో భద్రత లేకపోతే వారికి మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్లే.. ఈ రోజుల్లో చాలామంది యువ డాక్టర్లు 36 గంటలు ఏకధాటిగా పనిచేస్తున్నారు. వారికి పని ప్రదేశంలో భద్రత కల్పించడం కోసం ఓ జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించడం అత్యవసరం. మాపై విశ్వాసం ఉంచండి. క్షేత్రస్థాయిలో మార్పులు తెచ్చేందుకు మరో అత్యాచారమో లేదా హత్యనో జరిగేవరకు మనం ఎదురుచూడొద్దు" అని ధర్మాసనం వెల్లడించింది. దీనికోసం 10 మందితో ఓ జాతీయ టాస్క్ ఫోర్స్‌ను సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది.. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ గ్యాస్ట్రాలజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్తి శరిన్, ఎయిమ్స్ ఢిల్లీ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు సభ్యులుగా ఉంటారని తెలిపింది. వైద్యుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై మూడు వారాల్లోగా మధ్యంతర నివేదిక ఇవ్వాలని ధర్మాసనం ఈ కమిటీని సూచించింది.

### అధికారం చెలాయించొద్దు..

ఈసందర్భంగా ఘటనను నిరసిస్తూ జరిగిన ఆందోళనలపై బెంగాల్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. "శాంతియుత నిరసనకారులపై అధికారం చెలాయించొద్దు.. ఇది దేశమంతా ఆందోళన వ్యక్తం చేస్తున్న అంశం. డాక్టర్లు, పౌరసమాజాన్ని అడ్డుకోవడం సరికాదు. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే" అని ధర్మాసనం మందలించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఆగస్టు 22వ తేదీకి వాయిదా వేసింది.



# ఇద్దరు బాలికలకు స్వీపర్ లైంగిక వేధింపులు

- ◆బద్లాపుర్‌లోని ఓ ప్రముఖ పాఠశాలలో ఘటన
- ◆తల్లిదండ్రులు, స్థానికుల ఆందోళన
- ◆స్తంభించిన థానె నగరం
- ◆ ఏడు గంటలకు పైగా పట్టాల పైనే ఆందోళనకారులు.. రైళ్ల నిలిపివేత
- ◆పోలీసుల అదుపులో స్వీపర్

థానె: నాలుగేళ్ల ఇద్దరు బాలికలపై ఒక స్వీపర్ లైంగిక వేధింపులకు పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించింది. మహారాష్ట్రలోని బద్లాపుర్‌లోని ఒక ప్రఖ్యాత పాఠశాలలో జరిగిన ఈ ఘటనను నిరసిస్తూ తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళనకు దిగారు. దీంతో థానె నగరం స్తంభించింది. ఆందోళనకారులు రైలు పట్టాల పైకి రావడంతో స్థానిక రైళ్లను నిలిపివేశారు. ఈ ఘటనలో స్వీపర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బద్లాపుర్‌లోని పాఠశాలలో ఇటీవల ఈ లైంగిక వేధింపుల ఘటన జరిగింది. నాలుగేళ్ల వయసున్న ఇద్దరు బాలికలు టాయిలెట్‌లో ఉన్న సమయంలో దానిని శుభ్రం చేసే వంకతో ఒక స్వీపర్ వారి వద్దకు వెళ్లి అనుచితంగా ప్రవర్తించాడు. ఒక బాలిక అంతర్గత అవయవాల వద్ద నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మరో బాలిక పాఠశాలకు వెళ్లాలంటే భయపడింది. వైద్యుల వద్దకు తీసుకెళ్లగా వారిపై వేధింపులు జరిగినట్లు తేలింది. దీనిపై పోలీసులను ఆశ్రయించగా.. వారిని నుంచి తొలుత స్పందన రాలేదు. చివరకు శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. విచారణ అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా పాఠశాల నిర్వహణలో లోసుగులు బయటకు వచ్చాయి. బాలికల టాయిలెట్ నిర్వహణకు మహిళలను కేటాయించలేదని, పలు సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదని వెల్లడైంది.

ఈ ఘటనతో తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్‌లో ఆందోళనకారుల నిరసనతో రైళ్లు నిలిచిపోయాయి. ఈ పరిణామాలపై స్పందించిన బాలల హక్కుల జాతీయ కమిషన్.. దర్యాప్తు నిమిత్తం బద్రాపుర్‌కు ఒక బృందాన్ని పంపాలని నిర్ణయించింది. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మరోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపింది. అంతేకాకుండా ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసింది. ఆ పిల్లల క్లాస్ టీచర్, వారి బాధ్యతలు చూస్తున్న ఇద్దరు సిబ్బందిని తొలగించింది. సదరు స్వీపర్ కాంట్రాక్టు పద్ధతిన ఈ స్కూల్లో పనిచేస్తున్నాడు. అతడిని పంపిన కంపెనీతో కాంట్రాక్టు రద్దు చేసుకుంది. ఇక నిరసన చేస్తోన్న తల్లిదండ్రులకు మద్దతుగా మంగళవారం అన్ని పాఠశాలలను మూసివేశారు.



# రాజకీయాల్లోకి స్టార్ రెజ్లర్ వినేశ్ పొగాట్!

## హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో సోదరి బబిత పొగాట్‌పై పోటీ?

హర్యానా: అధిక బరువు కారణంగా అనర్హత వేటు పడటంతో స్టార్ రెజ్లర్ వినేశ్ పొగాట్ ఒలింపిక్స్ కల చెదిరింది. అనంతరం భారమైన హృదయంతో కుస్తీకి వీడ్కోలు పలికింది. దీంతో ఆమె భవిష్యత్తు ప్రయాణం ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారంటూ తాజాగా వార్తలు వెలువడుతున్నాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. తన సోదరి బబిత పొగాట్‌పై పోటీకి ఆమెను నిలబెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం.

"అవును ఆమె రాజకీయాల్లోకి ఎందుకు రాకూడదు. హర్యానల అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ వర్సెస్ బబితా ఫొగాట్ పోటీ ఉండొచ్చు. రాజకీయాల్లోకి రాబోనని గతంలో ఆమె ప్రకటించింది. అయితే, ఇప్పటికే కొన్ని రాజకీయ పార్టీలు ఆమెను సంప్రదించి సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏ పార్టీలో చేరనున్నారనేది మాత్రం ప్రస్తుతానికి స్పష్టత లేదు" అని ఫొగాట్ కుటుంబానికి అత్యంత సన్నిహిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి.

ఇదిలావుండగా మరో రెజ్లర్ బజ్లింగ్ పునియా కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలున్నట్లు సమాచారం. ఇటీవల వినేశ్ పొగాట్ స్వదేశానికి చేరుకున్న సమయంలో.. ఎయిర్‌పోర్టు వద్ద కాంగ్రెస్ ఎంపీ దీపిందర్ హుడా ఆమెను సాదరంగా స్వాగతించిన సంగతి తెలిసిందే. గతంలోనూ దీపిందర్ హుడా మాట్లాడుతూ.. వినేశ్‌ను రాజ్యసభకు పంపాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఆమె కాంగ్రెస్‌లో చేరొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

గత హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినేశ్ సోదరి బబితా 2019లో భాజపాలో చేరిన సంగతి తెలిసిందే. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో దాద్రి స్థానం నుంచి పోటీ చేసిన ఆమె ఓటమిపాలయ్యారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో మరోసారి ఆమెకు కమలం పార్టీ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ తాజా కథనాలు నిజమైతే.. ఈసారి హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పొగాట్ సిస్టర్స్ పోరు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారనుంది. హర్యానాలో అక్టోబరు 1వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# కోల్‌కతా హైకోర్టు తీర్పు 'సుప్రీం'లో కొట్టివేత

- ◆నిందితుడికి శిక్ష ఖరారు

ఢిల్లీ: కిశోరప్రాయ బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలంటూ గతేడాది ఓ తీర్పు సందర్భంగా కోల్‌కతా హైకోర్టు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో తాజాగా కీలక తీర్పు వెలువరించింది. ఆ వివాదాస్పద తీర్పును కొట్టివేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. ఆ కేసులో నిందితుడికి వేసిన శిక్షను పునరుద్ధరిస్తున్నట్లు స్పష్టం చేసింది.

బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు గాను బెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తికి కింది కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దీనిని సవాల్ చేస్తూ ఆ వ్యక్తి కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. గతేడాది అక్టోబరులో దీనిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. బాలిక అతడితో ఇష్టపూర్వకంగానే సాన్నిహిత్యాన్ని కొనసాగించిందన్న కారణంతో అతడిని నిర్దోషిగా ప్రకటించింది. ఆ సందర్భంగా న్యాయస్థానం కొన్ని సూచనలు చేసింది. 'కేవలం రెండు నిమిషాల లైంగిక ఆనందం కోసం చూసుకుంటే. సమాజం దృష్టిలో బాలికలు పరాజితులుగా మిగిలిపోతారు. కిశోరప్రాయ బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలి" అని సూచించింది.

దీనిపై అప్పట్లో పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ సూచనలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. మరోవైపు, నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలు దాఖలు చేసింది. వీటిపై గతంలో విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కోర్టు సూచనలపై అసహనం వ్యక్తం చేసింది. న్యాయమూర్తులు తీర్పుల్లో ప్రవచనాలు చెప్పరాదని పేర్కొంది. ఈ క్రమంలోనే తాజాగా దీనిపై తీర్పు వెలువరించింది. నిందితుడిని నిర్దోషిగా పేర్కొంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనబెట్టింది. అతడి శిక్షను పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించింది. అంతేగాక.. కోర్టులు తీర్పులు ఎలా రాయాలన్న దానిపై ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది.